PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 182 | విజయవాడ, శుక్రవారం 3 ఫిబ్రవరి 2023 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 3 February 2023 | Rs



కళాతపస్వి కన్నుమూత

హైదరాబాద్ : ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ (92) ఇక లేరు. శాస్త్రీయ కళలను, సామాజిక సమస్యలను ఇతివృత్తాలుగా చేసుకుని ఎన్నో సినిమాలను తీసిన ఆయన శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఆయన హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో కన్ను మూశారు. తెలుగు రాష్ట్రాల ప్రజానీకం ఈ వార్తతో దిగ్భ్రాంతికి గురయ్యారు. శాస్త్రీయ కళలను కథలుగా మలుచుకుని, అద్భుతమైన చిత్రకావ్యాలను తెరకెక్కించిన విశ్వనాథ్ కళాతపస్విగా తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. 1930 లో గుంటూరు జిల్లా రేపల్లె మండటం పెదపులివర్రు గ్రామంలో విశ్వనాథ్ జన్మించారు. గుంటూరు హిందూ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆంధ్ర యూనివర్శిటీలో బిఎస్సీ పూర్తి చేశారు. శంకరాభరణం సినిమా ఆయనకు ఎనలేని గుర్తింపు తెచ్చింది. 1980 ఫిబ్రవరి2న విడుదలైన ఈ సినిమా సంచలనం సృష్టించింది. జాతీయ పురస్కారాన్ని గెలుచుకుంది. శంకరాభరణంతో పాటు సాగరసంగమం, శృతి లయలు, సిరివెన్నెల, స్వర్ణకమలం, స్వాతికిరణం తదితర సినిమాలను శాస్త్రీయ కళల నేపథ్యంలో ఆయన తీశారు. సప్తపది, స్వాతిముత్యం,స్వయంకృషి, శుభలేఖ, ఆపద్బాంధవుడు. శుభసంకల్పం వంటి సినిమాలను సాంఘిక సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని తీశారు. తెలుగు సినీ చరిత్రలో ఆణిముత్యాల్లా నిలిచిపోయే దాదాపు 50 సినిమాలకు ఆయన దర్శకత్వం వహించారు. చిత్రరంగం మీద ఆసక్తితో చెన్నై వెళ్లిన ఆయన ఒక స్టూడియాలో సౌండ్ రికార్డు ఆర్టిస్టుగా సినీ జీవితాన్ని ఆరంభించారు. 1965లో అక్కినేని నాగేశ్వరరావు హీరోగా నటించిన ఆత్మగౌరవం సినిమాకు ఆయన తొలిసారిగా దర్శకత్వం వహించారు. దర్శకుడిగా ఆయన చివరి సినిమా శుభప్రదం. 1992లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. 2016లో దాదాసాహెబ్ పురస్కారం అందుకున్నారు. ప్రముఖ నటుడు కమల్‌హాసన్ సూచనతో దర్శకత్వంతో పాటు నటనారంగంలోకి ప్రవేశించిన ఆయన పలు చిత్రాల్లో నటించారు.

ఇంటర్‌లోనూ డిజిటల్ బోధన

- సమీక్షలో సిఎం జగన్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ విద్యార్థులకూ డిజిటల్ బోధన సౌలభ్యాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పాఠశాల విద్యాశాఖపై క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈ దిశలో అవసరమైన కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. 8వ తరగతి నుంచి ట్యాబ్‌లను ఇస్తున్నామని, 6వ తరగతి నుంచి ఐఎఫ్‌పి ప్యానెల్స్, 6వ తరగతిలోపు వారికి టివి స్క్రీన్లను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఈ నేపథ్యంలో డిజిటల్ బోధన ఏ రూపంలో ఉండాలన్న దానిపై ప్రతిపాదనలు ఇవ్వాలని చెప్పారు. ఆరో తరగతి నుంచే బోధనపై మరింత దృష్టి పెట్టాలని చెప్పారు. ఐఎఫ్‌బి ప్యానెల్స్‌ను నిర్దేశించుకున్న సమయంలోపు నాడు-నేడు పూర్తిచేసుకున్న పాఠశాలలకు అందించాలని ఆదేశించారు. వీటి ఏర్పాటు, సబ్జెక్టుల వారీ టీచర్లతో బోధనపై సీరియస్‌గా ఉండాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించేలోపే ట్యాబ్‌లను అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్యాబ్‌ల వినియోగంపై పిల్లల తల్లిదండ్రులకు ఫీడ్‌బ్యాక్ అందించాలని సూచించారు. వీటి వినియోగంలో కడప, విజయనగరం, చిత్తూరు జిల్లాల విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో ఉన్నారని సిఎంకు అధికారులు వివరించారు. ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేందుకు వీలుగా విద్యార్థులు ఇంగ్లీష్‌లో పట్టుపెంచుకునేందుకు వారికి చేదోడుగా నిలవాలని సిఎం ఆదేశించారు. ఇంగ్లీష్‌లో వారు మెరుగైన ప్రావీణ్యం సాధించాలని చెప్పారు. టోఫెల్, కేంబ్రిడ్జి వంటి సంస్థల భాగస్వామ్యాన్ని కూడా తీసుకోవాలని తెలిపారు. వీరి సహాయంతో మూడో తరగతి నుంచి పరీక్షలు నిర్వహించి పిల్లలకు సర్టిఫికెట్లు జారీచేసేలా కార్యక్రమాలను రూపొందించాలని ఆదేశించారు. టీచర్లకూ ఇంగ్లీష్‌పై శిక్షణ కార్యక్రమాలు కొనసాగించాలని చెప్పారు. విద్యారంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాలపై నిరంతర సమీక్ష, పర్యవేక్షణ అవసరమన్నారు. దీనివల్ల విద్యాకానుక మిగతా 2లో

'అదాని'పై చర్చకు నో

- ప్రతిపక్షాల తీవ్ర నిరసన
- నినాదాలతో దద్దరిల్లిన పార్లమెంటు




ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదాని గ్రూపు అవకతవకలతో పాటు, ఎల్‌ఐసికి జరిగిన నష్టంపై పార్లమెంటులో చర్చకు ప్రభుత్వం తిరస్కరించింది. దీంతో ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు తీవ్ర నిరసనను వ్యక్తం చేశాయి. నినాదాలతో ఉభయ సభలు మారుమ్రోగాయి. కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, సిపిఐ, టిఎంసి, ఎస్‌పి, జెడియు, ఆర్జెడి, శివసేన (యుబిటి), బిఆర్‌ఎస్, ఎన్‌సిపి, ఐయుఎంఎల్, ఎన్‌సి, ఆప్, కేరళ కాంగ్రెస్ తదితర పార్టీల సభ్యులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో ఉభయసభలు వాయిదాల బాట పట్టాయి. ఎటువంటి చర్చ లేకుండానే శుక్రవారానికి వాయిదా పడ్డాయి. గురువారం ప్రారంభమైన పార్లమెంటులో ఉభయసభల్లోనూ విపక్ష సభ్యులు ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకరు ఓం బిర్లా ప్రశ్నోత్తరాలను మొదలుపెట్టారు. అయితే అదానీపై హిండెన్ బర్గ్ నివేదిక గురించి చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్, సిపిఎం సహా కొన్ని పార్టీలు ఈ విషయంపై వాయిదా తీర్మానాలు ఇచ్చాయి. కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాకూర్, బిఆర్‌ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు, సిపిఎం ఎంపి పిఆర్ నటరాజన్‌తో పాటు మరికొంత మంది నోటీసులు ఇచ్చారు. ఇందుకు సభాపతి అంగీకరించలేదు. ప్రశ్నోత్తరాల గంట చాలా ముఖ్యమైందని, సభ్యులు అంతరాయం కలిగించొద్దని కోరారు. ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకు స్పీకరు వాయిదా వేశారు. దీంతో సభ ప్రారంభమైన నాలుగు నిమిషాలకే వాయిదా పడింది. మధ్యాహ్నం 2గంటలకు సభ తిరిగి ప్రారంభమవ్వగా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. వాయిదా తీర్మానాలపై చర్చ జరపాల్సిందేనని ప్రతిపక్ష ఎంపిలు గట్టిగా నినాదాలు చేశారు. ఆందోళనల నేపథ్యంలో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా పడింది.

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం 11 గంటలకు ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ సభను ప్రారంభించగా, వెంటనే ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, అదానీకి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, సిపిఎం ఎంపిలు ఎలమరం కరీం, వి శివదాసన్, సిపిఐ ఎంపి బినయ్ విశ్వం, శివసేనకు చెందిన ప్రియాంక చతుర్వేది, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన సంజయ్ సింగ్, బిఆర్‌ఎస్ ఎంపి కె కేశవరావుతో సహా తొమ్మిది మంది ఎంపిలు అదానీ గ్రూప్ స్టాక్ రూట్, మిలియన్ల కొద్దీ సామాన్యులపై దాని ప్రభావం గురించి చర్చించడానికి సాధారణ బిజినెస్‌ను నిలిపివేయాలని కోరుతూ రూల్ 267 కింద నోటీసులు ఇచ్చారు. నోటీసులు సక్రమంగా లేవని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ తిరస్కరించారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు తమ స్థానాల్లోనే లేచి నిరసనకు దిగారు. ప్రతిపక్షాల ఆందోళనతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి ప్రారంభమవ్వగా.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఆందోళనల నేపథ్యంలో సభను శుక్రవారం ఉదయం 11 గంటలకు వాయిదా వేశారు.

అదాని అప్పులపై ఆర్‌బిఐ ఆరా

న్యూఢిల్లీ : అదాని గ్రూపు తీవ్ర మోసాలకు పాల్పడుతున్నదని హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌పై ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. అదానీ కంపెనీలకు అప్పులిచ్చిన వివరాలను తమకు అందజేయాలని బ్యాంక్‌లు, విత్త సంస్థలను ఆర్‌బిఐ ఆదేశించినట్లుతెలిసింది. ఏయే బ్యాంక్‌లు ఎంత మొత్తం చొప్పున రుణాలిచ్చాయో సమగ్ర వివరాలతో నివేదిక పంపాలని ఆయా బ్యాంకులను ఆర్‌బిఐ నిర్దేశించినట్లు సమాచారం. విత్త సంస్థల నుంచి అదానీ గ్రూపు రూ.2 లక్షల కోట్ల పైన అప్పులు తీసుకుంది. అదాని కంపెనీ షేర్లలో భారీగా పెట్టుబడులు పెట్టిన ఎల్‌ఐసి రూ.వేల కోట్ల మేర నష్టాలను చవి చూస్తోంది. మరోవైపు అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.20 వేల కోట్ల ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పిఒ) సబ్‌స్క్రిప్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ.. దీనిపై సెబీ ఎలాంటి వివరణ కోరకపోవడం గమనార్హం.



సిద్ధిక్ కప్పన్ విడుదల

లోపలి పేజీలో..

ఇడి ఛార్జిషీట్‌లో కేజ్రీవాల్

మద్యం కేసులో కలకలం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేరును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ప్రస్తావించింది. ఈ మేరకు రూపొందించిన రెండవ ఛార్జ్‌సీట్‌ను సిబిఐ ప్రత్యేక కోర్టులో గురువారం దాఖలు చేసింది. కేజ్రీవాల్‌తో పాటు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి తదితరుల పేర్లను ఇడి పేర్కొంది. ఈ పరిణామం కలకలం రేపింది. 428 పేజీల ఛార్జ్‌షీట్‌లో 17 మంది పేర్లను పేర్కొంది. ఈ కేసులో నిందితుడు ఆప్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్ ఆప్ నాయకుల తరఫున ఇండోస్పిరిట్స్ చీఫ్ సమీర్ మహేంద్రూతో సంప్రదింపులు జరిపేవాడని చార్జిషీట్‌లో ఆరోపించింది. అరవింద్ కేజ్రీవాల్‌తో విజయ్ నాయర్ తన ఫోన్ నుండి ఫేస్‌టైమ్ యాప్ ద్వారా వీడియో కాల్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ కాల్‌లో 'విజయ్ మా అబ్బాయి, అతన్ని నమ్మి అతనితో కొనసాగండి' అని కేజ్రీవాల్ చెప్పినట్లు ఇడి పేర్కొంది. అలాగే రెండో చార్జిషీట్‌లో మరోసారి ఎమ్మెల్సీ కవిత పేరు ప్రస్తావించారు. . ఢిల్లీ ఒబెరాయ్ హోటల్‌లో జరిగిన సమావేశాల్లో కవిత పాల్గొన్నట్లుగా ఛార్జిషీట్‌లో ఉంది. 2022 నవంబర్ 12న అరుణ్‌పిళ్లైని విచారించినప్పుడు కవిత గురించి తెలిసిందని పేర్కొంది. ఆమ్‌ఆద్మీ పార్టీతో కవితకు పూర్తి సమన్వయం ఉందని, కవిత ప్రత్యేక విమానంలో పలు మార్లు హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వచ్చారని పేర్కొంది. ఈ సమయంలో కవిత వాడిన అన్ని ఫోన్లను ధ్వంసం చేశారని ఈడి తెలిపింది. ఆమ్‌ఆద్మీ పార్టీకి మద్యం టెండర్ల కోసం లంచంగా రూ.100 కోట్లు చెల్లించారని, ఇందుకు అరుణ్ పిళ్లై.. కవితకు సంబంధించిన వ్యక్తిగా ఇండో స్పిరిట్స్‌లో పార్ట్‌నర్‌గా చేరారని తెలిపింది. ఈ సమయంలో కవిత ఉపయోగించిన రెండు ఫోన్ నెంబర్లను ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ నెంబర్లను ఏ ఏ సమయంలో ఉపయోగించారో కూడా తేదీల వారీగా ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆప్‌కు మొత్తం రూ.100 కోట్ల ముడుపులు అందాయని తెలిపింది. లంచంగా వచ్చిన వంద కోట్లను గోవా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపయోగించిందని ఆరోపించి మద్యం పాలసీ కుంభకోణంలో సిండికేట్ కారణంగా ఢిల్లీ సర్కారుకు రూ.2,873 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు స్పష్టం చేసింది.



పూర్తిగా కల్పితం : కేజ్రీవాల్

ఇడి చార్జిషీటులో తన పేరును ప్రస్తావించడంపై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ స్పందించారు. 'ఇది పూర్తిగా కల్పితం' అని ఆయన అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ 'ఇడి అనేది ప్రభుత్వాలను పడగొట్టడానికి,ఎమ్మెల్యేలను కొనడానికి, విక్రయించడానికి సాధనంగా మారింది' అని విమర్శించారు.. అలాగే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపణల్లో వాస్తవం లేదని, తన వాంగ్మూలాన్ని బలవంతంగా పొందారని సమీర్ మహేంద్రూ కోర్టుకు చెప్పిన విషయాన్ని ఆప్ నాయకులు గుర్తు చేశారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి సున్నా

కేంద్రాన్ని చూస్తే వైసిపికి భయమెందుకు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి సున్నా చుట్టేసింది. ఏ ఒక్క ప్రాజెక్టుకూ కేంద్రం నిధులు ఇవ్వలేదు. ఎంపిలు నిరాశ బడ్జెట్ అంటే ఆర్థిక మంత్రి మాత్రం బ్రహ్మాండం అని అంటున్నారు. కేంద్రాన్ని చూస్తే భయమెందుకని' సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. తిరుపతిలోని ఎంబి భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విభజన చట్టాలను ఆమోదించి పదేళ్లయినా కేంద్ర బడ్జెట్‌లో హామీల ప్రస్తావన కానీ, నిధుల కేటాయింపులు గానీ జరగలేదన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధుల సాధనలో జగన్ సర్కార్ విఫలమయ్యిందని శ్రీనివాసరావు అన్నారు. 22 మంది వైసిపి ఎంపిలు ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. పోలవరం నిర్వాసితులకు రూ. 35వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేంద్రం చేతులెత్తేస్తోందని తెలిపారు. సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరిగి, పక్కనున్న ఆంధ్రాకు సున్నా కేటాయించడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు అన్ని పార్టీలూ కలిసి కేంద్రంపై పోరాడాలన్నారు. అందుకు వామపక్షాలు సమాయత్తం అవుతున్నాయని తెలిపారు. ధరలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఈనెల 22 నుంచి 28 వరకూ ఆందోళనకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. విశాఖ ఉక్కుపై కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. సోలార్ ప్రాజెక్టు పేరుతో అదానీకి 75వేల ఎకరాలను రైతుల నుంచి ప్రభుత్వమే దగ్గరుండి లీజుకిప్పిస్తోందన్నారు. ఎకరాకు రూ. 30వేలు చెల్లించి రూ.లక్షల కోట్ల లాభాలు గడించేందుకు అదానీకి రాష్ట్ర సర్కార్ సహకరించడంలో 'గోల్‌మాల్' అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అదానీకి ఇచ్చిన లీజ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య పాల్గొన్నారు.

'యువగళం' వాహనం సీజ్‌కు యత్నం

- టిడిపి శ్రేణుల నిరసనతో వెనక్కు తగ్గిన పోలీసులు
- నెల్లూరు నుంచే జగన్ పతనం: నారా లోకేష్



బహిరంగసభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి - పలమనేరు (చిత్తూరు జిల్లా)

టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కాన్వాయ్‌లోని యువగళం వాహనాన్ని పోలీసులు సీజ్ చేసేందుకు యత్నించి, టిడిపి శ్రేణుల ప్రతిఘటనతో వెనక్కు తగ్గారు. యువగళం పాదయాత్రలో భాగంగా గురువారం పలమనేరు బస్టాండ్ సమీపంలోని టవర్ క్లాక్ ముందు జాతీయ రహదారిపై మధ్యాహ్నం బహిరంగ సభ నిర్వహించారు. అయితే జాతీయ రహదారులపై బహిరంగ సభకు అనుమతి లేదంటూ, నిర్దిష్ట షరతులకు లోబడి పాదయాత్రకు అనుమతి మంజూరు చేశామని, నిబంధనలు ఉల్లంఘించారంటూ యువగళం వాహనాన్ని సీజ్ చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డికి పలమనేరు డిఎస్‌పి నోటీసులు జారీ చేశారు. వాహనాన్ని సీజ్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా..టిడిపి శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఏ రాజ్యంగం, ఏ చట్టం ప్రకారం వాహనాన్ని సీజ్ చేస్తారని పోలీసులను లోకేష్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ నంబర్-1 రాజ్యంగ విరుద్ధమని తెలిపారు. దీంతో పోలీసులు తిరిగి వాహనాన్ని ఇచ్చేశారు.

టవర్‌క్లాక్ సెంటర్‌లో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యుద్ధం మొదలయ్యిందని, జగన్ పతనం నెల్లూరు నుంచే ప్రారంభమయ్యిందన్నారు. మూడున్నరేళ్లలో ఒక్క కంపెనీనీ జగన్మోహన్‌రెడ్డి తేలేదన్నారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఏపిలో ఉన్న కంపెనీలన్నీ 'జె' ట్యాక్స్ కట్టలేక పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని విమర్శించారు. 25 ఎంపి సీట్లిస్తే ఢిల్లీలో మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పారని, ప్రస్తుతం తన మెడ వంచి కేసుల నుంచి బయట పడేందుకు సిఎం చూస్తున్నారన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఏపి మూడో స్థానంలో ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి బినామీ పలమనేరు ఎమ్మెల్యే వెంకటేశ్ గౌడ అని ఆరోపించారు. పలమనేరు అభివృద్ధికి అమరనాథరెడ్డి రూ. 650 కోట్లతో పనులు ప్రారంభిస్తే వైసిపి వచ్చాక నిలుపుదల చేసిందన్నారు. జిఒ నంబర్-1 తెచ్చి నన్ను ఆపాలని చూశారని, యువగళం ఆగదు, వారాహి ఆగదని అన్నారు. అధికారంలోకి వస్తే ఇళ్లస్థలాలిస్తామని తనను కలిసిన న్యాయవాదులకు లోకేష్ హామీ ఇచ్చారు.

టిడిపి నేతపై కాల్పులు

- పల్నాడులో కలకలం

ప్రజాశక్తి - రొంపిచర్ల, నరసరావుపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లాకు చెందిన టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి సభ్యులు వెన్నా బాలకోటిరెడ్డిపై కొందరు వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తెలుగుదేశం పార్టీకి చెందిన బాలకోటిరెడ్డి బంధువులే ఆయనపై కాల్పులకు దిగినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం రాత్రి పొద్దుపోయిన తరువాత అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి మరికొందరిని తీసుకుని బాలకోటిరెడ్డి ఇంటికి వెళ్లారని, తలుపు తట్టడంతో బయటకు వచ్చిన ఆయనపై సమీపం నుండి కాల్పులు జరిపారని తెలిపారు. పార్టీలో ప్రముఖస్థానం ఇప్పిస్తామని వెంకటేశ్వరరెడ్డితో డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయించారని, అయినా ఆయన్ను నిర్లక్ష్యం చేస్తుండడంతో హత్యకు పథకం పన్నారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులు వాడిన తుపాకిని రాజస్థాన్ నుండి తీసుకువచ్చారని, దానికి లైసెన్స్ లేదని చెప్పారు. కాల్పుల ఘటనను టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తీవ్రంగా ఖండించారు. దాడికి కారకులను తీవ్రంగా శిక్షించాలని కోరారు. కాల్పులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు కె.రామారావు, బి.నాగేశ్వరరావు, పి.అంజిరెడ్డి, ఎస్.వెంకటేశ్వరరాజు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు వైసిపి కారణమని టిడిపి నాయకులు ఆరోపిస్తుండగా, తమకు ఎటువంటి సంబంధం లేదని స్థానిక ఎంఎల్‌ఏ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలకోటిరెడ్డి

సలహాదారులతో సమాంతర ప్రభుత్వం

- హైకోర్టు ఘాటు వ్యాఖ్య

ప్రజాశక్తి-అమరావతి

సలహాదారుల నియమాకంపై హైకోర్టు మరోసారి తీవ్రంగా స్పందించింది. గురువారం జరిగిన విచారణలో ఈ విధానం కొనసాగితే సమాంతర ప్రభుత్వం ఏర్పడే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలకూకూడా సలహాదారులను నియమించేస్తారేమోనన్నసందేహం వస్తోందని పేర్కొంది. రోడ్లపై ఉన్న వారిని రాత్రికి రాత్రి సలహాదారులుగా నియమించకూడదని ఘాటు వ్యాఖ్య చేసింది. అత్యున్నత స్థాయి వారికి సలహాదారులను నియమించామన్న ప్రభుత్వ వాదనను తప్పు పట్టింది. ఏ స్థాయి వారైనా ప్రభుత్వంలో భాగమేనని పేర్కొంది. వారి వల్ల ప్రభుత్వ రహస్యాలు బయటకు వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించింది. విచారణను ఈ నెల 20కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ ఎన్ జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మైనార్టీలకు భరోసా : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షేమ, అభివృద్ధి పథకాలను జగన్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అందిస్తోందని, వైసిపితోనే భరోసా ఉంటుందనే అంశాన్ని క్షేత్రస్థాయిలో చాటి చెప్పాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని శుభమస్తు కళ్యాణ మండపంలో హర్‌దిల్ మే వైఎస్‌ఆర్ -హమ్ సబ్ జగన్ కే సాథ్ అనే నినాదంతో వైసిపి మైనార్టీ సెల్ ఆధ్వర్యాన గురువారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. రాజకీయంగా ముస్లిములకు ఎన్నో పదవులను జగన్ కట్టబెట్టారని తెలిపారు. ఈ మూడున్నర ఏళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.21 వేలకోట్లను మైనార్టీల కోసం ఖర్చు చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులు చదువుకునే స్కూళ్లను సిఎం జగన్ అభివృద్ధి చేశారన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయంగా ఎంతో మందికి అవకాశం కల్పించిన జగన్‌పై టిడిపి సాగిస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా కానమ్, ఎమ్మెల్సీ రుహుల్లా, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బడ్జెట్‌పై అవగాహన లేని వైసిపి : యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వైసిపి నాయకులు అవగాహన లేమితో మాట్లాడుతున్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మాండంగా ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రకటిస్తే, నిరాశాజనకంగా ఉందని ఎంపి మిథున్ రెడ్డి అంటున్నారని పేర్కొన్నారు. ప్రీ బడ్జెట్ సమావేశాల్లో తాము చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకొని కేంద్ర బడ్జెట్ తయారు చేశారని గొప్పగా చెప్పటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగితే నోరు మెదపకుండా తమ గొప్పదనమంటూ చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. 32 మంది ఎంపిలుండి ప్రత్యేక హోదా, పోలవరంపై కేంద్రం నిర్లక్ష్యం చేస్తున్నా.. ఎందుకు నోరు మెదపలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధిరేటు, సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని సిఎం జగన్‌కు సవాల్ విసిరారు.

ఫోన్ ట్యాపింగ్ ఊహించిందే

- పయ్యావుల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, నేతలపై నిఘా పెడుతోందని తాము మొదటి నుంచి చెబుతూనే ఉన్నామని, ఇప్పుడు నిజమైందని, టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తెలిపారు. ప్రతిపక్షనేతలతోపాటు సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులపై కూడా నిఘాపెట్టారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ బండారాన్ని సొంత పార్టీ ఎమ్మెల్యేలే బయటపెడుతున్నారని తెలిపారు. ఎవరిపై నిఘా పెట్టారో, ఏఏ నెంబర్లపై నిఘా పెట్టారో కేంద్ర సంస్థలతో ఆడిట్ చేయించడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరే దమ్మూ, ధైర్యం సిఎంకు ఉన్నాయా? అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. విచారణ జరిపించకపోతే సిఎం తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటర్‌లోనూ డిజిటల్ బోధన

మొదటి పేజీ తరువాయి

నుంచి పాఠ్యాంశాల వరకూ, మౌలిక సదుపాయాలు నుంచి గోరుముద్ద వరకూ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. ప్రతిఏటా ఇస్తున్న విద్యాకానుక వస్తువులపై పరిశీలన చేయాలన్నారు. పాఠ్య పుస్తకాల్లో పేపర్ క్యాలిటీ బాగుండాలని సూచించారు. జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిమాల్ట్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు సిఎంకు చెప్పారు. విద్యాకానుక కిట్లను మార్చిలో మొదలుపెట్టి ఏప్రిల్ చివరి నాటికి పాఠశాలలకు చేరుస్తామని తెలిపారు. ఈ సమీక్షలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, విద్యాశాఖ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్, కమిషనరు ఎస్ సురేష్‌కుమార్, మౌలిక వసతులశాఖ కమిషనరు కాటమనేని భాస్కర్, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకకు మరిన్ని బస్సులు

- కెఎస్‌ఆర్‌టిసితో ఎపిఎస్‌ఆర్‌టిసి ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఇరు రాష్ట్రాల ఆర్‌టిసి ఎండీలు సిహెచ్ ద్వారకా తిరుమలరావు, వి అంబుకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్ణాటక నుంచి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎపిఎస్ ఆర్‌టిసి మరిన్ని సర్వీసులను నడిపేలా కర్ణాటక ఆర్‌టిసితో అంతర్రాష్ట్ర ఒప్పందం చేసుకుంది. విజయవాడలోని ఆర్‌టిసి హౌస్‌లో ఈ మేరకు కెఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి వి అంబుకుమార్‌తో ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు రెండు రాష్ట్రాల మధ్య కొత్త సర్వీసుల ఆవశ్యకతపై గురువారం చర్చలు జరిపి అవగాహన ఒప్పందంపై పరస్పరం సంతకాలు చేశారు. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రెండు రాష్ట్రాల నుంచి కొత్త రూట్లలో బస్సులను నడపాలని అవగాహనకు వచ్చారు. ఎపిఎస్ ఆర్‌టిసి 327 కొత్త బస్సులతో 69,284 కిలోమీటర్లు కర్ణాటకలో నడపాలని, అలాగే కెఎస్ ఆర్‌టిసి 496 బస్సులను 69,371 కిలో మీటర్లను రాష్ట్రంలో నడపాలని రెండు రాష్ట్రాల ఆర్‌టిసి అధికారుల మధ్య అంగీకారం కుదిరింది. ఈ కొత్త ఒప్పందం అమలైతే కర్ణాటకలో ఎపిఎస్ ఆర్‌టిసికి చెందిన 1,322 బస్సులు మొత్తం 2,34,762 కిలోమీటర్లు తిరుగుతాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కెఎస్ ఆర్‌టిసికి చెందిన 1,489 బస్సులు 2,26,044 కిలోమీటర్లు నడుస్తాయి. ఈ ఒప్పందం మేరకు రానున్న మూడు నెలల్లో కొత్త రూట్లలో కొత్త బస్సులను నడిపేలా ఆర్‌టిసి కార్యాచరణ తయారుచేస్తోంది. ఇప్పటికే ఎపిఎస్ ఆర్‌టిసి ఒడిశా ఆర్‌టిసితోనూ కొత్త బస్సులను నడిపేలా 2022 డిసెంబరులో ఒప్పందం చేసుకుంది. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఉండే తెలుగు ప్రజలకు ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఈ అవగాహన ఒప్పంద కార్యక్రమంలో కెఎస్ ఆర్‌టిసి డైరెక్టరు ప్రశాంత్‌కుమార్ మిశ్రా, సిటిఎం ఆపరేషన్స్ ఆంథోని జార్జ్, సిటిఎం కమర్షియల్ ఎస్ రాజేష్, ఎపిఎస్ ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎ కోటేశ్వరరావు, కెఎస్ బ్రహ్మానందరెడ్డి, పి కృష్ణమోహన్, ఆర్థిక సలహాదారు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమకు తీవ్ర నష్టం

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిఎం సమాధానం చెప్పాలి
- టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్ణాటక రాష్ట్రం తలపెట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీటి పరంగా రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నష్టం జరగనుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో జగన్ కనీస స్పృహ లేకుండా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి ఇన్‌ఛార్జులు, ముఖ్యనేతలతో చంద్రబాబు పలు అంశాలపై ఆన్‌లైన్ విధానంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సీమ ప్రాజెక్టులను మూలన పడేసి ప్రభుత్వం నష్టం చేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. జగన్ గతంలో చెప్పిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు. పోలవరం, నదుల అనుసంధాన ప్రాజెక్టులు పూర్తయి ఉంటే రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్లు ఇచ్చే అవకాశం ఉండేదని తెలిపారు. రాష్ట్రాన్ని జగన్ ఎటుతీసుకెళున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకు జిఒ 1 తేవడం, రాజకీయ పక్షాలపై ఆంక్షలు, కేసులు, ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాలు తప్ప ముఖ్యమంత్రికి రాష్ట్రం గురించి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో జగన్ అడుగడుగునా రాజీ పడుతున్నారని అన్నారు. విభజన చట్టం ప్రకారం సాధించాల్సిన హక్కుల విషయంలో వైసిపి ప్రభుత్వ వైఫల్యం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. విభజన హక్కుల సాధనలో కీలకమైన చివరి కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పొందడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైసిపి ఎంపిలు సొంత లాబీయింగ్ కోసమే పనిచేస్తున్నారని, రాష్ట్రం కోసం కాదని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కరువు జిల్లాలకు నిధులు సహా ఒక్క అంశంలో కూడా జగన్ కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత టిడిపి ప్రభుత్వం విభజన చట్టంలో ఉన్న 11 కేంద్ర సంస్థలను రాష్ట్రానికి తీసుకొచ్చిందని, ఇప్పుడు వాటి పురోగతి ఏంటో కూడా ఈ ప్రభుత్వం చెప్పలేని స్థితిలో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మూడున్నరేళ్లలో నిలిచిపోయిన ప్రాజెక్టులు, సంస్థల దగ్గరకు వెళ్లాలని, జరిగిన ప్రతి నష్టంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై జగన్ తప్పించుకోలేరని అన్నారు. సొంత పార్టీలో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు తమ ఫోన్‌లు ట్యాప్ అవుతున్నాయని రోడ్డెక్కిన పరిస్థితిపై సిఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ స్కీం పెడితే అందులో స్కాం ఉంటుందని విమర్శించారు.

ఉపాధి హామీకి నిధుల తగ్గింపు తగదు

- ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్ (గుంటూరు జిల్లా)



ఉపాధి హామీ చట్టానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం సబబుకాదని, సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగాన్ని పునర్జీవనం కలిగించే చర్యలు ఎక్కడా లేవని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు విమర్శించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన చట్టంలోని హామీల అమలుకు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదనలు లేకపోవడం విచారకరమన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణ కోసం జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం నుండి రూ.2 వేల కోట్లు బకాయిలు రావాల్సి ఉండడంతో వారు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ ఆందోళనలకు పిలుపునిస్తే ప్రభుత్వం నిరంకుశ చర్యలకు దిగడం దారుణమన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధానిగా అమరావతిని చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అమరావతికి బడ్జెట్‌లో నిధులు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. జగనన్న కాలనీల్లో రెండో దశ ఇళ్ల నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే ప్రారంభించాని, జిఒ 1ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం, సిఐటియు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముఖ ఆధారిత హాజరు రద్దు చేయాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

కార్మికులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేస్తున్న ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కార్మిక సంఘాలతో జాయింట్ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కెబి భవన్‌లో మున్సిపల్ కార్మికుల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం గురువారం జరిగింది. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తలపెట్టిన ముఖ ఆధారిత హాజరు విధానం వల్ల రాష్ట్రంలోని 123 నగర కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో పని చేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దీనిపై కార్మికులకు అనుభవం లేనందువల్ల వారు నష్టపోతారని తెలిపారు. కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు, తక్కువ చదువు కలిగిన వారు ఉన్నారని అన్నారు. అత్యధిక మందికి స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం తెలియదన్నారు. హాజరుపడితేనే జీతాలు వస్తాయని చెబుతున్న తరుణంలో కార్మికులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్మికులను ముఖ ఆధారిత హాజరు విధానం నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని జిందాల్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ కేంద్రం వద్ద లారీ డ్రైవర్లు, క్లీనర్లకు కనీస వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి తాగునీరు, క్యాంటీన్, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం రాష్ట్ర మున్సిపల్ శాఖ అధికారులను కలిసి సమస్యలపై విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిబసు, ఎన్‌వై నాయుడు, టి.నూకరాజు, యు.రాజు, కె.పెంచలనరసయ్య, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పత్తి తూకాల్లో మోసం

- ఆదోని మార్కెట్‌లో నష్టపోతున్న రైతులు
- కన్నెత్తి చూడని అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/ఆదోని రూరల్

కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్ యార్డులో పత్తి తూకాల్లో మోసాలు చోటు చేసుకుటుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో పత్తి బోరెంలో (దాదాపు 300 కిలోల నుంచి 500 కిలోల వరకు సంచిని బట్టి) ఐదు కిలోల నుంచి ఎనిమిది కిలోల వరకు తూకాల్లో తక్కువ చూపించి మోసగిస్తున్నారు. రాయలసీమలో పేరుగాంచిన ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొందరు వేమెన్‌లు (కాటాదారులు) మోసాలకు పాల్పడుతున్నారు. ఆదోని మార్కెట్ యార్డుకు కర్నూలు జిల్లా రైతులేగాక అనంతపురం, తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా, కర్నాటక రాష్ట్రం సిరుగుప్ప, బళ్లారి జిల్లాల నుంచి నిత్యం వందలాది మంది రైతులు పత్తి పంటను తీసుకువస్తారు. రోజు వెయ్యి నుంచి మూడు వేల క్వింటాళ్ల వరకు యార్డుకు విక్రయానికి వస్తాయి. సీజన్‌లో అయితే రోజుకు నాలుగు వేల క్వింటాళ్లకు పైగా పత్తి యార్డుకు వస్తుంది.

యార్డులో 355 పైగా దుకాణాలు ఉన్నాయి. దుకాణానికి ఐదు నుంచి పది మంది వేమెన్‌లను పత్తిని తూకం వేసేందుకు కేటాయించారు. టెండర్ పూర్తైన వెంటనే వారికి కేటాయించిన కమీషన్ ఏజెంట్ వద్ద తూకాలు వేయడం, రోజూ ఎన్ని క్వింటాళ్ల తూకాలు వేశారో ఆ వివరాలను మార్కెట్ కమిటీకి కాటాదారులు అందించాల్సి ఉంటుంది. వ్యాపారులు ఇచ్చే డబ్బులకు ఆశపడి కొందరు కాటాదారులు తక్కువ తూకం చూపి రైతులను దగా చేస్తున్నారు.

ఎలక్ట్రానిక్ కాటా ఉన్నా..



ఆదోని మార్కెట్ యార్డుకు వచ్చిన పత్తి

తూకాల్లో పారదర్శకత కోసం ఎనిమిదేళ్ల క్రితం ఎలక్ట్రానిక్ కాటాలను ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రవేశపెట్టారు. అక్రమాలు బయటపడతాయని ఎలక్ట్రానిక్ కాటాలను అప్పుడు కొంత మంది వ్యతిరేకించినా విజయవంతంగా అమలు చేశారు. అయినా కొంత మంది అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. రోజుకు పది వేల క్వింటాళ్ల పత్తి మార్కెట్‌కు వస్తే అందులో దాదాపు 500 కిలోలు రైతులు నష్టపోతున్నారు. ఆదోని పట్టణంలో రహదారులకు ఇరువైపులా రోడ్డు పైనే వ్యాపారాలు జోరందుకున్నాయి. తూనికలు కొలతల శాఖ నుంచి అనుమతి లేకుండా కాటాలు వినియోగిస్తున్నారు. పలు చోట్ల నేటికీ పాతకాలపు రాళ్లతోనే తూకాలు వేస్తూ రైతులను మోసగిస్తున్నారు. తూకాల్లో మోసాల వైపు మార్కెట్ యార్డు, తూనికలు కొలతల శాఖ అధికారులు చూడడం లేదని రైతులు వాపోతున్నారు.

తరచూ తనిఖీలు

వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట దిగుబడుల తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు మైక్ ద్వారా మోసాల గురించి అనౌన్స్ చేస్తూనే ఉన్నాం. తరచూ తనిఖీలు కూడా చేస్తున్నాం.

- శ్రీకాంత్ రెడ్డి, ఆదోని మార్కెట్ యార్డ్ కార్యదర్శి.

'ఉక్కు'ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)



రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను ఐక్య పోరాటాలతో కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 721వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, యుటిలిటిస్, అడ్మిన్, టిటిఐ విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, ఎం.రాజశేఖర్ మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయమై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కర్మాగారానికి సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలనుకునేవారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఉక్కు కార్మికుల పోరాటానికి అందరి మద్దతూ దక్కుతోందన్నారు. దీక్షల్లో వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహన్ కుమార్, సిహెచ్.సన్యాసిరావు, డి.సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆంధ్రమాల్యాద్రి

దళితులే లక్ష్యంగా దాడులు

- ఐక్య ఉద్యమాలతో ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం : శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

'దేశంలో దళితులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి.. మతం ముసుగులో రాజకీయం చేస్తూ మనువాదాన్ని బలవంతంగా సమాజంపై రుద్దుతున్నారు... ఆఖరికి మనిషిని మనిషిగా గుర్తించడం లేదు... దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ఐక్య ఉద్యమాలు చేపడదాం' అని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. 'రాజ్యాంగ విధ్వంసం- దళితుల రక్షణ' అనే అంశంపై గురువారం తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కెవిపిఎస్ నగర అధ్యక్షులు ఎన్.బాలాజీ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దళిత్ శోచన్ ముక్తిమంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. దళితులకు అండగా ఉండే రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాదాన్ని అమలు చేస్తోందని విమర్శించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు గతం కంటే చాలా తక్కువ నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలకు రక్షణగా ఉన్న రాజ్యాంగాన్ని విధ్వంసం కాకుండా కాపాడుకుందామని చెప్పారు. రిపబ్లిక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ.. వివక్షత అనేది అనేక రూపాల్లో, కోణాల్లో ఉంటుందన్నారు. దేవుడు ముందు అందరూ సమానమే అంటారని, కానీ 70 ఏళ్ల చరిత్రలో టిటిడి ఇఒగా దళితుడిని నియమించలేదన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు పి.మునిరామయ్య, గౌరవధ్యక్షులు అంగేరి పుల్లయ్య, అరుణాచలం, దళిత, గిరిజనులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఖాతాల్లోకి నేడు నగదు జమ

విదేశీవిద్యా దీవెన కింద వేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నగదు జమచేయనుంది. క్యూఎస్ ర్యాంకింగ్స్ ప్రకారం టాప్ 200 విదేశీ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు పొందిన 213 మంది విద్యార్థులకు మొదటి విడత సాయంగా రూ.19.95 కోట్లు వారి ఖాతాల్లో జమచేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్‌సి, ఎస్‌సి, బిసి, మైనార్టీ విద్యార్థులకు గరిష్టంగా రూ.1.25 కోట్లు, ఇతర విద్యార్థులకు గరిష్టంగా రూ.కోటి వరకు 100 శాతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంటు ప్రభుత్వం అందిస్తుంది. 100 నుంచి 200 ర్యాంకులు పొందిన యూనివర్సిటీల్లో ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు, గరిష్టంగా రూ.75 లక్షల వరకు అందించనుంది. ఇతర విద్యార్థులకు గరిష్టంగా రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం, ఏది తక్కువైతే అది చెల్లిస్తుంది. విద్యార్థులకు విమాన, వీసా ఛార్జీలను ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేస్తుంది.

వేతన జీవులను వంచించిన కేంద్రం

- సిసిజిజిఒఒ విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి, మధ్య తరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్ (సిసిజిజిఒఒ) తెలిపింది. వేతన జీవులను కేంద్ర ప్రభుత్వం వంచించిందని విమర్శించింది. ఈ మేరకు సిసిజిజిఒఒ జాతీయ ఉపాధ్యక్షులు వి కృష్ణమోహన్ ఒక ప్రకటన విడుదల చేశారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ.. క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందని అన్నారు. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్యతరగతి ఉద్యోగులకు ఏ మాత్రం ప్రయోజనం కలిగించడంలేదని విమర్శించారు. తక్కువ వేతనాదాయ వర్గాలు వినియోగించుకుంటున్న పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.2.50 లక్షల నుంచి రూ.మూడు లక్షలకు పెంచటం నామ మాత్రమేనని తెలిపారు. 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బిజెపి డిమాండ్ చేసిన స్టాండర్డ్ డిడక్షన్ రూ.ఐదు లక్షలు గానీ, పొదుపు మొత్తాలపై రూ.మూడు లక్షలకు పెంచాలన్న డిమాండ్‌ను అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేళ్ల కాలంలో అమలు చేయలేదని విమర్శించారు. శ్లాబు రేట్ల సవరణ కూడా స్వల్పంగానే ఉందని తెలిపారు.

డెకరేషన్ గోదాములో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



హైదరాబాద్ నగరంలోని బాగ్‌లింగంపల్లిలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాగ్‌లింగంపల్లి విఎస్‌టి సమీపంలోని గోదాములో అగ్ని ప్రమాదం సంభవించి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. శుభకార్యాలకు ఉపయోగించే డెకరేషన్ సామగ్రి మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆదుపుచేశారు. అగ్ని ప్రమాదం జరిగిన గోదాము పరిసర ప్రాంతాల్లో బస్తీలు ఉండడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

వారికిదే ఫైనల్ వార్నింగ్: మంత్రి తలసాని

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'వేసవి కాలం దగ్గరకు వస్తోంది. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కమర్షియల్ వ్యాపారాలు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. అన్ని ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వారి వల్ల సామాన్యులకు ఏదైనా నష్టం జరిగితే మాత్రం సహించేది లేదు. ఈ మధ్య కాలంలో ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి ఓ పరిష్కార మార్గాన్ని తీసుకొచ్చేందుకు ఒక కమిటీని సైతం ఏర్పాటు చేశాం. కమర్షియల్ వ్యాపారాలు చేసే వ్యాపారులకు ఇదే ఫైనల్ వార్నింగ్" అని తలసాని హెచ్చరించారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా



విజయవాడలో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్క్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఖాళీ ప్లేట్లను చేతబూని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలనేగాక, దేశ ప్రజలను కూడా మరోసారి దగా చేశారని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే ప్రాజెక్టుల ఊసే ఎత్తలేదన్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటనేలేదని, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల కేటాయింపులేదని మండిపడ్డారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధుల ఊసేలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు పెంచకపోగా నిర్వాసితులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఆహారం, ఎరువులు, వంటగ్యాస్ సబ్సిడీలో కోత పెట్టి పేదలు, రైతుల నోట్లో మట్టి కొట్టే విధంగా బడ్జెట్ ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ఉపాధి హామీని ప్రవేశపెట్టకపోగా, గ్రామీణ ఉపాధి హామీకి రూ.30 వేల కోట్ల మేర మోడీ ప్రభుత్వం కోత విధించిందని తెలిపారు. రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం చేస్తోన్న అన్యాయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ మోడీ విధానాలు, బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితమై ఉద్యమించాలని కోరారు. ధర్నాలో సిపిఎం సెంట్రల్, పశ్చిమ సిటీల కార్యదర్శులు బి.రమణారావు, బోయి సత్యబాబు, నాయకులు కె.దుర్గారావు, బి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

బైజూస్‌లో మరో వెయ్యి మంది తొలగింపు

ముంబయి : ఎడ్యూటెక్ సంస్థ బైజూస్ మరో 1000 మంది ఉద్యోగులను తొలగించింది. గతంలో 2500 మందిని తొలగించిన ఈ సంస్థ తాజాగా మరో వెయ్యి మందిని లేఆఫ్‌ల పేరుతో ఇంటికి పంపిదని జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. ఖర్చుల తగ్గింపులో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

కొత్త నియామకాలొద్దు

- సవరణ అంచనాలపై ఆర్థికశాఖ ఆంక్షలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

త్వరలో ముగియనున్న 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సవరణ అంచనాలపై అధికారులు కసరత్తు వేగవంతం చేస్తున్నారు. దీనికోసం అన్ని శాఖలకూ ఆర్థికశాఖ కీలక మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. ఈ మార్గదర్శకాల్లో ప్రధానంగా పోస్టుల భర్తీపైనా కొన్ని ఆంక్షలు ఉండటం గమనార్హం. మరో నాలుగు అంశాలపై మరికొన్ని ఆంక్షలు ఉన్నాయి. నిర్దిష్ట గణాంకాలను సిద్ధం చేసేందుకుగానూ ఐదు రకాల అంశాలను సవరణ అంచనాల్లో ప్రతిపాదించవద్దని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు మార్చి 31 వరకు అమలులో ఉంటాయని ఆర్థికశాఖ స్పష్టం చేసింది.ప్రధానంగా కొత్త పథకాలు, కొత్త పనులకు సంబంధించిన ప్రతిపాదనలు వద్దని పేర్కొంది. అలాగే అదనపు నిధులు, పున్ణకేటాయింపులపైనా నిధులు కోరుతూ ప్రతిపాదనలు వద్దని స్పష్టం చేసింది. కేవలం కేంద్ర పథకాలు, నాబార్డు పనులు, ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు, కోర్టు కేసుల్లో ఉన్న వాటికి నిధులకు మాత్రం వెసులుబాటు కల్పించింది. కొత్త పోస్టులు ఏర్పాటు, ఉన్న పోస్టుల స్థాయి పెంపు, కొత్త నియామకాలపైనా ఆంక్షలు విధిస్తూ వాటిపై ప్రతిపాదనలు వద్దని తేల్చిచెప్పింది. కొత్తగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కన్సల్టెంట్ల నియామకాలు వద్దని, వీటిపై మార్చి నెలాఖరు వరకు ప్రతిపాదనలు పంపించవద్దని ఆర్థికశాఖ తేల్చిచెప్పింది. ఈ మార్గదర్శకాలు పాటించాలని అన్ని శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులకు స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలతో ఉన్న ఖాళీలపైనే ఎక్కువగా చర్చ జరుగుతోంది. ఖజానాకు సమస్యలు ఉన్న నేపథ్యంలో ఈ ఆంక్షలు మార్చి 31 వరకే ఉంటాయా?, ఆ తరువాత కూడా కొన సాగుతాయా? అన్నదానిపై చర్చ జరుగుతోంది.

నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి



నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జిగా ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైసిపి అధిష్టానం నియమించింది. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఢిల్లీ నుంచి తాడేపల్లికి చేరుకుని సిఎం తొలుత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, నెల్లూరు రీజియన్ కో-ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసులరెడ్డితో భేటీ అయ్యారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జికి సంబంధించి పలుమార్లు చర్చించి చివరికి ఆదాల పేరును ప్రకటించారు. 2024ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఉంటారని సిఎం ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి అధికారికంగా ప్రకటించారు. రెండ్రోజుల నుంచి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని వైసిపిలో జరుగుతున్న డ్రామాకు సిఎం తెరదించారు.

జీవితాంతం వైసిపితోనే ...

- హోం శాఖ మాజీ మంత్రి సుచరిత

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



ఎమ్మెల్యేల ఫోన్‌లను ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని మాజీ హోంశాఖ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. గుంటూరులోని తన నివాసంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల కదలికలపై నిఘా ఉంటుందని తెలిపారు. వారు ఎవరిని కలుస్తున్నారో? ఎక్కడికి వెళ్తున్నారో తెలుసుకోవడం నిఘా వర్గాల బాధ్యతని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అవాస్తమని తెలిపారు. తాను వైసిపిని వీడి టిడిపిలోకి వెళ్తున్నానని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తన రాజకీయ జీవితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే అని స్పష్టం చేశారు. వైసిపిని వీడే ప్రసక్తే లేదన్నారు. ఆ పరిస్థితి వస్తే ఇంటికే పరిమితమవుతానని, మరో పార్టీలోకి వెళ్లనని తెలిపారు. సోషల్ మీడియాలో పోస్టులను ఆధారంగా చేసుకొని తనపై వరుసగా కథనాలు రావడం సరికాదన్నారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

హామీ అమలు చేయాలి

- డిఎంఎకి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులకు సంబంధించి సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ నాయకులు గురువారం డిఎంఎ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. సంక్షేమ పథకాల అమలు చేస్తామన్న హామీని నేరవేర్చలేదని తెలిపారు, దీనిపై స్పందించిన డిఎంఎ త్వరలో జాయింట్ మీటింగు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు.

'ఒక'టొస్తే ఓడిలోనే !

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రతినెలా ఒకటో తేదీ వస్తే చాలు రాష్ట్ర ఆర్థికశాఖ ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లడం ఆనవాయితీగా మారిపోయింది. జీతాలు, పింఛన్లు, సామాజిక పింఛన్లకు నిధుల కొరత వేధిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లాల్సి వస్తోందని అధికారులే అంటున్నారు. గత నెలలో దాదాపు రూ.1800 కోట్లతో ఓడికి వెళ్లిన ఆర్థికశాఖ ఈ నెలలో కూడా ఒకటో తేదీన ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లింది. రెండో తేదీ కూడా అదే ఓడిని కొనసాగించడం గమనార్హం. తొలిరోజు రూ.300 కోట్ల వరకు ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లగా, రెండో తేదీకి రూ.1600 కోట్ల వరకు ఓడికి చేరుకుంది. ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లడం ఈ త్రైమాసికంలో 13 రోజులు కాగా, ఈ నెలలో వరుసగా రెండు రోజులు కావడం గమనార్హం.

మార్చి నుంచి ఫ్యామిలీ డాక్టర్

- మంత్రి విడదల రజని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని మార్చి నెల నుంచి సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని ఆదేశించారు. మంగళగిరి ఎపిఐఐసి టవర్స్‌లోని వైదారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఈ పథకం అమలు చేస్తున్నందున వాటిని కూడా సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ క్లినిక్‌లలో కూడా సిబ్బందిని తక్షణం నియమించుకోవాలన్నారు.

విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో నిర్మాణాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు ఈ ఏడాది ఎన్‌ఎంసి తనిఖీలు చేసే అవకాశం ఉందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎంటి కృష్ణబాబు, కమిషనరు జె నివాస్, ఆరోగ్యశ్రీ సిఇఒ హరీంద్ర ప్రసాద్, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ప్రజావ్యతిరేక బడ్జెట్

పార్లమెంటులో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్ల కొమ్ముకాసింది. మాంద్యం ముప్పు పొంచి ఉందంటూ ఆర్థిక సర్వేనే హెచ్చరించిన వేళ ముంచుకొచ్చే అధిక ధరలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కుంచించుకుపోవడం, ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవడం వంటి కీలకమైన సమస్యలకు పరిష్కారం చూపడంలో విఫలమైంది. బడ్జెట్ అంటేనే రాబోయే ఏడాది కాలం పాటు వివిధ రంగాల్లో అవసరాలను అంచనా వేసి ఆ మేరకు కేటాయింపులు చేస్తూ, దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే ప్రక్రియ. ఇంత కీలకమైన కసరత్తులో సామాన్యులను విస్మరించిన తరువాత ఇక చెప్పుకునేదేముంది? ప్రజా వ్యతిరేకమని తప్ప! దీనిని కప్పిపుచ్చడానికి ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ఎన్నో విన్యాసాలు చేశారు. సప్తర్షుల మార్గమని, అమృతకాలమని, ప్రజల్ని కేంద్రంగా చేసుకున్నామని చెప్పారు. 'తిండి కలిగితే కండ గలదోయ్..కండగలవాడేను మనిషోయ్' అని మహాకవి గురజాడ చెప్పారు. ఆ స్ఫూర్తి బడ్జెట్‌లో మచ్చుకైనా కానరాదు.

నలభైఐదు లక్షల కోట్ల రూపాయల పై చిలుకు బడ్జెట్‌లో అన్ని రంగాలకు కేటాయింపులు ఉండవా అంటే ఉంటాయి. అయితే ఆ కేటాయింపుల్లో సింహభాగం దక్కింది ఎవరికి? కోతలు పడిందెవరికి? ప్రయోజనాలు పొందేదెవ్వరు? నష్టపోయేదెవరన్నవి కీలక ప్రశ్నలు. మాంద్యం ప్రభావంతో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు అడుగంటుతున్నాయి. మన దేశంలోనూ దాని ప్రకంపనలు కనపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ప్రభావం మరింత తీవ్రంగా పడుతుందన్నది ఆర్థిక సర్వే హెచ్చరిక. అటువంటి ప్రమాదమే ముంచుకొస్తే గ్రామీణ ప్రాంతాలపై తీవ్ర ఒత్తిడి పడుతుందన్నది కరోనా కష్టకాలంలో దేశం అనుభవం. దీనిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఉపాధి హామీ పథకానికి ఏకంగా 30 వేల కోట్ల రూపాయలు కోత పెట్టడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పోనీ పట్టణ ప్రాంతాల్లో కొత్త ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు బడ్జెట్‌లో ఏమైనా ప్రతిపాదించారా అంటే అదీ లేదు. పెట్టుబడి వ్యయం పెంచామంటూ మాటలు చెప్పడం తప్ప! పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణలోకి తీసుకుంటే పెంచినదెంత? దానిలో నిరుద్యోగులకు, ఉపాధి కోల్పోయే వారికి దక్కేదెంత? వ్యవసాయం, ఎరువులు, ధాన్యం సేకరణ, చివరకు రేషన్ కార్డుల మీద తక్కువ ధరకు పేదలకిచ్చే బియ్యం, గోధుమలు తదితర తిండిగింజల మీద సబ్సిడీలోనూ వేల కోట్ల రూపాయలు దిగ్గోశారు. పోనీ, పెరిగే ధరలను అదుపు చేయనున్నారా అంటే బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. పైగా పెట్రోలియంపై ఇచ్చే అరకొర సబ్సిడీల్లోనూ కోత పెట్టారు. మైనార్టీల సంక్షేమానికి, వారి పిల్లల చదువుకు స్కాలర్‌షిప్‌లకు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు గత ఏడాదితో పోలిస్తే 38 శాతం కోత పెట్టి బడ్జెట్‌కు మతం రంగు పులిమిన ఘనతను మోడీ సర్కారు మూటగట్టుకుంది. ఇన్ని కోతలు పెట్టిన తరువాత దీనిని ప్రజాకేంద్ర బడ్జెట్‌గా అభివర్ణించారంటే అసలు వారి దృష్టిలో ప్రజలంటే ఎవరో?

ఇక రాష్ట్రాలకు చేసిన కేటాయింపుల్లోనూ వివక్షే! బిజెపి ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలకు ఉదారంగా కేటాయింపులు జరపగా, ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కర్ణాటకకు వరాల జల్లు కురిపించడాన్ని ఏమనాలి? సరళీకరణ విధానాల అమలులో భాగంగా రాష్ట్రాలు చేసే వ్యయంపై ఆంక్షలు, అప్పులు తెచ్చుకోవాలన్నా తప్పనిసరిగా మారిన షరతులు సరేసరే! ఇక మన రాష్ట్రంపై చూపిన సవతి తల్లి ప్రేమ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ప్రత్యేక హోదా నుండి విశాఖ రైల్వే జోన్ వరకు ప్రజలు ఆశించేవేవీ బడ్జెట్‌లో లేవు. అయినా, రాష్ట్ర ఆర్థికమంత్రి బడ్జెట్ బావుందని కొనియాడితే, అధికార పార్టీకే చెందిన ఎంపి నిరాశజనకమంటూ పెదవి విరిచారు. కళ్ల ముందు కనపడుతున్న అన్యాయంపై కూడా అధికార పార్టీకి ఇంత అయోమయం ఏమిటో? ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధినేత రాష్ట్రానికి నిధులు కేటాయించని బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం మాని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందించారు. ఇటువంటి రాజకీయ విన్యాసాల వల్ల ప్రయోజనం లేదు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరానికి నిధులు వంటి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి ఐక్యంగా ఉద్యమించాలి. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను జనం నిరసించాలి.

మంచి మాట



'నిజం' కూడా ప్రతి రోజూ ప్రచారంలో ఉండాలి. లేకుంటే అబద్ధం' నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు. ప్రపంచాన్నే నాశనం చేస్తుంది.

- డా॥ బి.ఆర్. అంబేద్కర్,

భారత రాజ్యాంగ నిర్మాత.

విశ్లేషణ

మందగిస్తున్న ఉత్పాదకత

తన ఉచ్చులో తానే పడ్డ పెట్టుబడిదారీ వ్యవస్థ

సంజయ్ రాయ్

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ పరిస్థితి మొత్తంగా చూసినప్పుడు దారీ తెన్నూ లేని పరిస్థితి కనిపిస్తోంది. ఆహార దినుసుల ధరలు, ఇంధనం (విద్యుత్తు, చమురు) ధరలు బాగాపెరిగి మొత్తం జీవన వ్యయం భారంగా తయారైంది. వడ్డీ రేట్లు పెరగడంతో పెట్టుబడి వ్యయం కూడా పెరిగింది. దానితోబాటు ద్రవ్య నిల్వలు కూడా భద్రంగా ఉండే దేశాలకు తరలిపోతున్నాయి. ఈ స్థూల ఆర్థిక సూచికలతోబాటు ఉత్పాదకతలో వృద్ధి కూడా మందగించడం ప్రస్తుత సంక్షోభపు లోతును సూచిస్తోంది.

ఆర్థిక పెట్టుబడులకు, ఉత్పత్తి అయిన ఆర్థిక సంపదకు మధ్య నిష్పత్తిని స్థూలంగా ఉత్పాదకత అనవచ్చు. ఒక కార్మికుడిపై చేసే ఖర్చుకి, అతడినుండి రాబట్టే ఉత్పత్తికి మధ్య నిష్పత్తి శ్రామిక ఉత్పాదకత అవుతుంది. శ్రామిక ఉత్పాదకత పెరుగుదల సాంకేతిక అభివృద్ధి మీద, కొత్త సాంకేతికతను ఇముడ్చుకోగలిగిన సామర్థ్యం మీద, కార్మికుడి నైపుణ్యంలో పెరుగుదలమీద-ఇలా అనేక అంశాలమీద ఆధారపడి వుంటుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో తనతో పోటీపడే వారి మీద పైచేయి సాధించడానికి, పరిశ్రమ మొత్తంగా సాధించే సగటు లాభం కన్నా ఎక్కువ లాభం పొందడానికి ఒక్కో పెట్టుబడిదారుడూ నిరంతరం కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తన పరిశ్రమలో ప్రవేశపెడుతూవుంటాడు. అదే పని తక్కినవారందరూ కూడా చేయగానే, పరిశ్రమ సగటు ఉత్పాదకత కూడా పెరుగుతుంది. తిరిగి తక్కినవారిమీద పైచేయి కోసం మళ్ళీ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతీ పెట్టుబడిదారుడూ తీసుకువస్తూనే వుంటాడు.

ఆ విధంగా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధితోబాటు ఉత్పాదకతలో వృద్ధి కూడా సద్యోజనితంగా జరిగిపోతూ వుంటుంది. ఉత్పాదకత పెరుగుదల పెట్టుబడిదారుల లాభాలను మరింత పెంచుతుంది. దానితోబాటు కార్మికుల నిజవేతనాలు కూడా పెరుగుతాయి. అంతేగాక ప్రభుత్వానికి పన్నుల రూపేణా లభించే ఆదాయం కూడా పెరుగుతుంది. దానివలన ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి, మౌలిక సదుపాయాల కల్పనకు మరింత హెచ్చుగా ఖర్చు చేయగలుగుతాయి.

ఆదాయాలు పెరిగినందువలన మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది. దానిని అందుకోడానికి అదనంగా పెట్టుబడులు అవసరం అవుతాయి. కొత్త యంత్రాలు అవసరమౌతాయి. ఐతే ఉత్పాదకత వృద్ధి వలన వచ్చిన ప్రయోజనాలు ఎవరెవరికి ఎంతెంతమేరకు పంపిణీ చేయబడ్డాయి అన్నదానిమీద ఆధారపడి ఈ అభివృద్ధి వలయం కొనసాగుతుంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఎక్కువమందికి అందుబాటులోకి వచ్చింది. విద్య, నైపుణ్యం ఏ మేరకు వృద్ధి చెందుతున్నాయి, వంటి అంశాలు ఇక్కడ కీలకం. ఈ అంశాలమధ్య పరస్పరం లంకె ఉంటుంది. ఏ కారణం చేతనైనా ఆ లంకె తెగిపోతే. ఉత్పాదకత అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభంలో పడుతుంది. గత మూడు దశాబ్దాలుగా ఉత్పాదకతలో వేగం తగ్గడం అనేది నిరంతరాయ ధోరణిగా వ్యక్తం అవుతోంది. ముందు సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లోను, ఆ వెంబడే, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోను ఇది వ్యక్తం అవుతోంది.



> ఇప్పుడు ప్రతీ వినియోగదారుడి ప్రత్యేక అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను డిజైన్ చేయడానికి పూనుకుంటున్నారు. అందుకు వినియోగదారులకు సంబంధించిన డేటా కీలకం. ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే ఆ డేటా చాలా ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. దానిని చేజిక్కించుకుని డిజిటల్ ప్లాట్‌ఫారంలలో పదిలపరిచి వినియోగిస్తున్నారు. తద్వారా మొత్తం ప్రపంచ మార్కెట్ పైన తమ గుత్తాధిపత్యాన్ని చెలాయించబూనుకుంటున్నారు.

ఉత్పాదకత వేగం తగ్గుదల

1980 దశకం నాటికి బ్రహ్మాండమైన సాంకేతిక పురోభివృద్ధి సాధించారు. సమాచార రంగ టెక్నాలజీలోను, కృత్రిమ మేధో సాంకేతికతలోను, సైబర్ టెక్నాలజీ, ఆటోమేషన్ లోను, జెనెటిక్స్‌లోను,వివిధ పారిశ్రామిక రంగాల్లోను (ఇవన్నీ కలిపి 4.0 టెక్నాలజీ అని అంటున్నారు) అద్భుత పురోగతి ఉంది. ఐనప్పటికీ, రెండో చమురు సంక్షోభం తర్వాత సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఉత్పాదకత మందగించడం మొదలైంది. తాజా ఐఎల్‌వో నివేదికలను బట్టి 1990తర్వాత ఉత్పాదకత వృద్ధి వేగం మళ్ళీ పుంజుకుంది. ఐతే ఆ తర్వాత మళ్ళీ మందగించడం మొదలైంది. 1991 నాటికి సంపన్న దేశాల్లో కార్మికుల ఉత్పాదకత అభివృద్ధి చెందుతున్న దేశాల కార్మికుల ఉత్పాదకత కన్నా 14 రెట్లు ఎక్కువగా ఉండేది. 2021 నాటికి ఇది 18 రెట్లు అయింది. సంపన్నదేశాల కార్మికుల ఉత్పాదకత పెరగడం వలన ఇది జరగలేదు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో వేగం తరుగుదల వలన జరిగింది. గత మూడు దశాబ్దాలలో సంపన్న దేశాలలో కార్మికుల ఉత్పాదకత 46 శాతం పెరిగితే అల్పాదాయ దేశాలలో అది 16 శాతమే పెరిగింది. అభివృద్ధి చెందుతున్న దేశాలలో చైనాలో ఉత్పాదకత పెరుగుదల వేగం తక్కిన దేశాలకన్నా చాలా ఎక్కువగా ఉంది. 2000 ముందు వరకూ దక్షిణాసియా దేశాలలోనూ ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత బద్దలైన ఆర్థిక సంక్షోభం తర్వాత అక్కడ మందగించడం మొదలైంది. ఇప్పుడున్న వేగంతోటే ఉత్పాదకత వృద్ధి కొనసాగితే సంపన్న దేశాలలోని ఉత్పాదకత స్థాయిలో సగం వరకూ చేరుకోడానికి పేద దేశాలకు 175 సంవత్సరాలు పడుతుంది. కాబట్టి వెనుకబడిన దేశాలు ఉత్పాదకత విషయంలో సంపన్న దేశాలతో సమాన స్థాయికి చేరుకోవడం అనేది కనుచూపు మేరలో సాధ్యం అయ్యేలా లేదు. ఇప్పుడు ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ ఉత్పాదకత రేటు మందగమనాన్ని చవిచూస్తున్నాయి.

ఒక కొత్త సాంకేతిక విప్లవం జరుగుతున్న దశలో, టెక్నాలజీ ప్రపంచంలో ఏ మూలనుండి ఏ మూలకైనా తరలించగలిగిన నయా ఉదారవాద శకంలో ఈ ఉత్పాదకత మందగమనం సంభవించడమే విడ్డూరం అనిపిస్తుంది. ఇలా జరగడానికి కారణం నయా ఉదారవాద వ్యవస్థలోనే ఉంది. దీనికి సమాధానం శాస్త్ర సాంకేతిక రంగంలో వెతికితే కనపడదు. ఉత్పాదకత వృద్ధికి, దాని ఫలితంగా వచ్చే అదనపు సంపద పంపిణీకి మధ్య ఉన్న లింకు తెగిపోవడంలోఉంది.

అదనపు సంపద పంపిణీలో అసమానతలు

ఉత్పాదకత పెరిగినందువలన ఉత్పత్తి అయ్యే అదనపు సంపదను, కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్థిక వ్యవస్థ మొత్తానికి అందుబాటులోకి తెచ్చేలా పంపిణీ జరగాలి. అలా జరగనందువలన వాటి నడుమ ఉండే లంకె తెగిపోతుంది. ఇప్పుడు కొత్త సాంకేతికత ఉపయోగించినందువలన పెరిగిన ఉత్పాదకత ఫలితాలను సంపన్నులే చేజిక్కించుకుంటున్నారు. దానికి తోడు పెద్ద పెద్ద సంస్థలు కొత్త సాంకేతిక పరిజ్ఞానం మీద (పేటెంట్ల వ్యవస్థ ద్వారా) గుత్తాధిపత్యం కలిగివున్నాయి. దానివలన ఆ పరిజ్ఞానం ఆర్థిక వ్యవస్థ మొత్తానికి విస్తరించకుండా పరిమితం అయిపోతున్నది. ఇప్పుడు ప్రతీ వినియోగదారుడి ప్రత్యేక అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను డిజైన్ చేయడానికి పూనుకుంటున్నారు. అందుకు వినియోగదారులకు సంబంధించిన డేటా కీలకం. ప్రపంచ వ్యాప్తంగా చూసుకుంటే ఆ డేటా చాలా ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. దానిని చేజిక్కించుకుని డిజిటల్ ప్లాట్‌ఫారంలలో పదిలపరిచి వినియోగిస్తున్నారు. తద్వారా మొత్తం ప్రపంచమార్కెట్ పైన తమ గుత్తాధిపత్యాన్ని చెలాయించబూనుకుంటున్నారు. కొద్ది సంస్థల చేతుల్లో ఈ డిజిటల్ డేటా ఇరుక్కుపోయినందువలన టెక్నాలజీ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద విస్తరించడానికి ఆటంకం కలుగుతోంది. నయా ఉదారవాద వ్యవస్థలో కార్మికులు ఉత్పత్తిలో పొందే వాటా బాగా తగ్గిపోతున్నది. పెట్టుబడిదారుల వాటా పెరిగిపోతోంది. కార్మికుల వాటా గనుక పెరిగితే అప్పుడు మార్కెట్ లో సరుకులకు, సేవలకు డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు ఏర్పడే వైవిధ్యపూరితమైన డిమాండ్ ను అందుకోడానికి కొత్త పెట్టుబడులు, కొత్త పరిశోధనలు అవసరమౌతాయి. అది ఆర్థికవృద్ధికి అదనపు ఊపు తెస్తుంది.

గత మూడు దశాబ్దాల కాలంలో సంపన్న దేశాలలోని సాంకేతిక పరిజ్ఞానం మీద, వెనుకబడ్డ దేశాలలోని సహజ వనరుల మీద, చౌకగా లభించే కార్మిక శక్తి మీద ఆధారపడి నయా ఉదారవాద వ్యవస్థ ప్రధానంగా నడిచింది. దీనివలన ఎటువంటి నాణ్యత గాని, ప్రమాణాలు గాని లేని ఉద్యోగాలు ప్రపంచవ్యాప్తంగా పెరిగాయి. ఈ అసంఘటిత కార్మికుల అస్థిర పరిస్థితులను బాగా ఉపయోగించుకుని పెట్టుబడిదారులు లాభాలు బాగా ఆర్జించగలిగారు. అంతర్జాతీయంగా సాగుతున్న మార్కెట్ పోటీలో నిలదొక్కుకోడానికి వెనుకబడిన దేశాలు తమ లేబర్ మార్కెట్ లను కనిష్ట స్థాయికి తీసుకుపోతున్నాయి. అతి తక్కువ వేతనాలతో హీనమైన సర్వీసుకండిషన్లతో కూడిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, తదితర పద్ధతులలో ఉండే ఉద్యోగాలు ఎక్కువయ్యాయి. . కార్మికుల శ్రమను పిండుకోవడం పెరిగింది. దీని వలన తక్షణమే పెట్టుబడిదారులకు లాభాలు పెరుగుతాయి. కాని వెనుకబడిన దేశాల నడుమ నెలకొన్న పోటీ వాతావరణం వలన ఆ పెట్టుబడిదారులు తమ లాభాల మార్జిన్ లను తగ్గించుకోక తప్పని పరిస్థితి వస్తోంది. ఎంత హీనస్థాయికి కార్మికుల వేతనాలు కుదించబడుతున్నాయో, అంత ఎక్కువగా బహుళజాతి సంస్థలు ఆ కార్మికులు ఉత్పత్తి చేసిన అదనపు విలువను కొల్లగొడుతున్నాయి. .

కాని అదే క్రమంలో ఉత్పాదకతలో సంక్షోభం కూడ మెల్లమెల్లగా మొదలౌతుంది. తక్కువ వేతనాలకే పని చేసే కార్మికుల ఉత్పాదకత కూడా తక్కువగానే ఉంటుంది. వారి ఉత్పాదకత పెరగాలంటే వారికి అందించే చదువులో నాణ్యత పెరగాలి. కొత్త టెక్నాలజీని ఉపయోగించగల శిక్షణను వారికి ఇచ్చి వారి నైపుణ్యాన్ని పెంచాలి. ఇది దీర్ఘకాలిక స్వభావం కలిగినటువంటిది. ఇప్పుడు మార్కెట్ లో ఏరోజు పరిస్థితి ఏ విధంగా ఉంటుందో తెలియనటువంటి అనిశ్చిత స్థితి ఉంది. అటువంటప్పుడు దీర్ఘకాలిక స్వభావం కల అంశాలలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ సిద్ధం కావడం లేదు. పైగా నయా ఉదారవాదం విద్యను ప్రైవేటీకరించాలని పట్టుబడుతుంది. దాని ఫలితంగా అత్యధిక యువజనులు నాణ్యతగల విద్యకు, శిక్షణకు దూరమౌతున్నారు. అందువలన సామర్థ్యం కలిగిన శ్రామికులకు కొరత ఏర్పడుతోంది. ఐతే అటువంటి శ్రామికులను తయారు చేయడానికి కావలసిన పెట్టుబడులు పెట్టడానికి మాత్రం ఎవరూ ముందుకు రావడంలేదు. చిన్న తరహా పెట్టుబడిదారులకు, సంస్థలకు అంత స్థోమత ఉండదు. ఈ కారణాల వలన తక్కువ పెట్టుబడితో, తక్కువ వేతనాలతో, తక్కువ ఉత్పాదకతతో కూడిన పారిశ్రామిక రంగం పెరుగుతోంది. ఇంకోపక్క కొద్దిపాటి బహుళజాతి సంస్థలు మాత్రం అత్యంత ఆధునిక టెక్నాలజీతో, అధిక ఉత్పాదకతతో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. అధిక ఉత్పాదకత- అధిక వేతనాలు- అధిక డిమాండ్ వలయం కొనసాగడం సాధ్యం కావడంలేదు. . దానివలన కొత్త పరిశోధనలు మందగిస్తున్నాయి. ఇదంతా చూసినప్పుడు పెట్టుబడిదారీ విధానం తాను వేసిన ఉచ్చులో తానే చిక్కుకు పోయిందని స్పష్టమౌతోంది.

(సరళానువాదం) ★

కామన్‌సెన్స్

జ్ఞానం అంటే ఏమిటి?



డా॥ దేవరాజు మహారాజు

మతం చుట్టూ తిరిగేదే 'జ్ఞానం' అనే ఆలోచన సమాజంలో బాగా నాటుకుపోయింది. ఏ దేశమైనా, ఏ మతమైనా ఇదే భావనని జనంలో స్థిరపరిచాయి. కానీ, కాలం గడుస్తున్న కొద్దీ జ్ఞానానికీ మతానికీ దూరం పెరుగుతూ వచ్చింది. జ్ఞానం - ఏ మతం చుట్టూ ప్రదక్షిణలు చేయదని సర్వ స్వతంత్రంగా ఎదుగుతుందని, తనను నమ్ముకున్న జనం ఎదుగుదలకు తప్పక తోడ్పడుతుందని తేలింది. మనిషి, మనిషిగా మారడానికి - మారి, నిలబడడానికీ, నిలబడి ఎదగడానికీ జ్ఞానం... అంటే విజ్ఞానం - నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. అతణ్ణి ఈర్ష్య ద్వేషాల నుంచి, అసూయ ప్రతీకారాల నుంచి, మూఢనమ్మకాల నుంచి బయట పడేసి, నైతిక జీవిగా కొనసాగడానికి దోహదం చేస్తుంది.

మానవ వాదానికి బీజాలు విజ్ఞాన శాస్త్రంలోనే ఉన్నాయి. ఏ మతం లోనూ లేవు. అందుకే జ్ఞానాన్ని మత రహిత స్థాయికి తెచ్చుకోవాలి. ప్రాపంచిక దృక్పథంతో, విశాల భావాలతో మానవ జాతి అంతా ఒకటేనని జన్యుశాస్త్రం అందించిన "జ్ఞానాన్ని" స్వీకరిస్తే ప్రతి ఒక్కరూ మానవవాదులే అవుతారు. విజ్ఞాన శాస్త్రాన్ని తన సృజనాత్మకతతో సాంకేతిక శాస్త్రంగా తీర్చిదిద్దుకోగల సామర్థ్యం కేవలం మనిషికే ఉంది. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచిని పెంపొందించడానికి మాత్రమే ఉపయోగించుకోవాలి. మనిషిలోని స్వార్థం వెర్రితలలు వేస్తే సాంకేతిక పరిజ్ఞానం మానవ వినాశనానికి దారితీస్తుంది. ఆ విషయం కూడా గుర్తుంచుకోవడం మంచిది. 'విజ్ఞానాన్ని, మత రహిత స్థాయికి ఎందుకు తీసుకుపోవాలి? మతం ఉంటే నష్టమేమిటి?' అని ఎవరైనా ప్రశ్నిస్తే అందుకు మనం ఈ విధంగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అబద్ధాలతో నిజాలు జత కట్టవు. వాస్తవాలు ఊహల్లో తేలిపోవు. ఊహల్లో తేలిపోతే తేలిపోవచ్చు... కానీ, అవి అప్పుడు వాస్తవాలుగా మిగలవు.

మత గ్రంథాలలో ఉన్న స్వర్గ నరకాలకు అడ్రస్‌లు లేవు. శతాబ్దాలుగా భక్తులెవరూ తమ దేవీ దేవతల మొబైల్ నెంబర్లు సంపాదించలేకపోయారు. గ్రహాలన్నీ దేవతలకు నివాసాలని అంటారు కదా? మరి, రాకెట్లలో గ్రహాంతరయానం చేసే మన 'మానవ మాత్రులకు' వారు ఎక్కడా కనపడరెందుకూ? అయినా, గతంలో విశ్వసించినట్టు గ్రహాలు దేవతల నిలయాలని ఇప్పుడు ఎవరూ విశ్వసించడం లేదు. ఇక్కడ భూమి మీద సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్లనే కొద్దిమంది పరిపాలకులు కోట్ల మంది జనాన్ని అదుపులో పెట్టగలుగుతున్నారు. మరి ఈ సాంకేతిక పరిజ్ఞానం దేవీ దేవతల మీద పని చేయడం లేదు. ఎందుకంటారా? వారు నిజంగా ఉంటే పని చేసేది. లేని వాళ్ళ మీద ఎలా పనిచేస్తుంది చెప్పండి?

అయితే, అందుకు కారణం కూడా ఉంది. భ్రమ భ్రమలతో కలుస్తుంది. వాస్తవాలు వాస్తవాలతో మాత్రమే అతుకుతాయి. నిన్న రాత్రి నిద్రలో కన్న కలలు ఇవ్వాళ రాత్రి కూడా కను - ప్రమాదం లేదు. కానీ, పొద్దున వాస్తవంలో మోటారు సైకిల్‌పై వెళుతూ రాత్రి కన్న కలలు కంటానంటే యాక్సిడెంట్ అవుతుంది. ఒక వాస్తవాన్ని భ్రమలతో కలుపుతానంటే ఇలాగే ప్రమాదాలు జరుగుతాయి. వాస్తవాల ఆధారంగా బతికే వాడికే, తనకు జ్ఞానం ఉందన్న స్పృహ ఉన్నవాడికే విజ్ఞానం అందుబాటులోకి వస్తుంది. మతాల మాయలో పడితే తెలివి తేటలు కాదు గదా మూర్ఖత్వం అబ్బుతుంది! అప్పుడు అందుకు తగిన వేషం ఒకటి వేసుకుని ఎంచక్కా వ్యాపారం చేసుకోవచ్చు. సిగ్గూ ఎగ్గూ, నైతికత అన్ని వదిలేసినవాడు ఇక ఏం చేస్తాడూ? తోటి మనుషుల్ని మోసం చేస్తాడు. అన్ని మతాల గురువులు, ప్రభోదకులు, ముల్లాలు, పాస్టర్‌లు, పురోహితులు, ప్రవచనకారులు చేస్తున్న పని ఇదే!



> మానవ వాదానికి బీజాలు విజ్ఞాన శాస్త్రంలోనే ఉన్నాయి. ఏ మతం లోనూ లేవు. అందుకే జ్ఞానాన్ని మత రహిత స్థాయికి తెచ్చుకోవాలి. ప్రాపంచిక దృక్పథంతో, విశాల భావాలతో మానవ జాతి అంతా ఒకటేనని జన్యుశాస్త్రం అందించిన "జ్ఞానాన్ని" స్వీకరిస్తే ప్రతి ఒక్కరూ మానవవాదులే అవుతారు.

పాకే జంతువు నుండి పక్షి రావడం, వానరం నుంచి మనిషి రావడం అనేది వీరు తెలుసుకోరు. తెలుసుకున్నా అర్థం చేసుకోరు. ఆత్మ, జన్మ, పునర్జన్మల గూర్చిన పరిజ్ఞానమే 'జ్ఞానం' అని అనుకుంటూ ఉంటారు. ఆధునిక జన్యుశాస్త్రం చెప్పే వంశ పారంపర్య లక్షణాలు వీరికి విచిత్రంగా తోస్తాయి.

వంద, రెండు వందల సంవత్సరాల చరిత్ర చూసుకుని మాది గొప్ప వంశం, మా కులం గొప్పది, మా మతం గొప్పది అని విర్రవీగడం హాస్యాస్పదమైన విషయం. ఇంకా వెనక్కి వెళ్ళి చూసుకుంటే వేల సంవత్సరాల క్రితం మన పూర్వీకులు ఎక్కడ ఉండేవారో, ఎలా ఉండేవారో, ఎటు నుండి ఎటు వలస వెళ్ళారో, వారి మత విశ్వాసాలేవో, ఎవరు ఎవరిని పెళ్లి చేసుకున్నారో ఎవరికి తెలుసు? అందువల్ల ఏదో రెండు, మూడు తరాల వంశ చరిత్ర చూసుకుని విర్రవీగడం మూర్ఖత్వం అవుతుంది. ఇంకా కొంచెం వెనక్కి వెళితే, అందరమూ ఆ మహా మిశ్రమ మానవ జాతి నుంచి వచ్చిన వాళ్ళమేనని తెలుసుకుంటాం! మానవ వాదులుగా మారడానికి తెలుసుకోవాల్సిన మొదటి అంశం-జ్ఞాన గుళిక ఇదే!

మార్పు అంతర్గతంగా వారిలోంచే రావాలి. వారు తమ వివేకాన్ని కొద్ది కొద్దిగా ఉపయోగిస్తూ ఉంటే, తప్పకుండా మార్పు వస్తుంది. దేనివల్ల ఈ సమాజం ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలోకి వచ్చిందో ముందు గ్రహించుకోవాలి. దేవుడు, దయ్యం, ఆత్మ, పరమాత్మ, ఆధ్యాత్మికత, ధ్యానాల వల్ల రాలేదు. కేవలం వైజ్ఞానిక స్పృహ తోనే, వైజ్ఞానిక పరిశోధనల తోనే వచ్చింది. ఇవే మనల్ని ఇంకా ముందుకు తీసుకుపోతాయి. మనిషి తను కష్టపడే తత్వాన్ని, నిజాయితీని, నైతికతను వదిలేస్తే ఎదురయ్యే ప్రమాదాలు చాలా ఉన్నాయి. వదిలేయకుండా ఉండగలగడమే జ్ఞానం!

పొరపాటున జనం పెత్తందారీ వ్యవస్థకు లొంగిపోతే గనక, తీరని నష్టాన్ని ఎదుర్కొనాల్సి వస్తుంది. ఇక్కడ మరొక పెద్ద ప్రమాదం పొంచి వుంది. పెత్తందారీ సంస్కృతి గనక సాంకేతిక శాస్త్రాన్ని తన ఆధీనంలోకి తీసుకుంటే, అది మానవ స్వేచ్ఛనే హరిస్తుంది. అంతే కాదు, మానవ జాతిని తుదముట్టించే ప్రమాదం కూడా ఉంది. పరిస్థితులు అంతగా విషమిస్తే వాటిని అదుపులోకి తేవడానికి అసలు మనిషే ఉండడు కదా? విజ్ఞాన శాస్త్రం రెండంచుల కత్తి లాంటిది. ఎటు వాడుతున్నాం? ఎంత వాడుతున్నాం? ఎలా వాడుతున్నాం? వంటివి తెలియాలి. విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకోవడమే జ్ఞానం. దీని మీద మత ఆధిపత్యం ఉండకూడదు. ఎందుకంటే, గతంలో ముక్కు మూసుకుని చేసిన తపస్సుల వల్ల ఎవరూ ఏమీ సాధించలేదు. ఇక ముందు కూడా సాధించలేరు. సాధించారని చెప్పుకునే మహిమలు కేవలం అసత్యాలు మాత్రమే! ఆ పద్ధతులు మానేసి మనిషి తనలోని స్వార్థాన్ని, కుత్సిత బుద్ధిని తగ్గించుకుంటే సత్వరం ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. చిత్తశుద్ధిగల యువతీ యువకులు హేతువాదులైతే, నిరీశ్వర వాదులైతే, సైన్సు కార్యకర్తలయితే...వారు రాజకీయంగా ఎదిగి అధికారం చేపట్ట గలిగితే ఈ ప్రపంచం రూపురేఖలు మారతాయి. మానవత్వం వెల్లి విరిస్తుంది. మతాల పరిధిలో 'జ్ఞానాన్ని' గిరికీలు కొట్టిస్తున్న కుట్రను బద్దలు కొట్టి పైకి ఎదిగితేనే... ఎవరికైనా "జ్ఞానం - అంటే ఏమిటీ?" అనే జ్ఞానోదయం అవుతుంది.

/ వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త/

జనవాక్యం

ఉద్యోగ సమస్యలకు మోక్షం లేదా?

ఉద్యోగ ఖాళీల పూరింపు, ఏటా జాబ్ క్యాలండర్, అధికారం చేపట్టిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు, ఒప్పంద, దినసరి ఉద్యోగుల పర్మినెంట్, కేంద్రం ప్రకటించిన వెంటనే కరువు భత్యం చెల్లింపు, మెరుగైన ఫిట్మెంట్‌తో వేతన సవరణ...వంటి హామీలతో అధికారం చేపట్టారు జగన్ మోహన్ రెడ్డి. ముఖ్యమంత్రిగా ఆయన ఏ ఒక్కటీ అమలు చేయకుండా ముప్పై నెలలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలుకు పూనుకోవాలి.

- యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం.

మితిమీరుతున్న పోలీసు జులుం

రాష్ట్రంలో రోజురోజుకు పోలీసుల దురుసు ప్రవర్తన మితిమీరి పోవడాన్ని సామాన్యులు తట్టుకోలేకపోతున్నారు. చాలా సందర్భాల్లో అధికార పార్టీ నేతల ఒత్తిడి కూడా కారణంగా చెబుతున్నారు. పోలీసులు...ప్రజల మానవ, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలి. కాపాడాలి. పోలీసులు ఎటువంటి రాజకీయ ఒత్తిడికి తలొగ్గక చట్టపరంగా విధులు నిర్వహించాలి. సామాన్యులు పోలీసు స్టేషన్‌కు రావలంటేనే భయపడే దుస్థితి పోవాలి.

- జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జెపిసి లేదా సుప్రీం పర్యవేక్షణలో విచారణ

ప్రతిపక్షాలు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ గ్రూప్ పై హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదికపై దర్యాప్తు చేపట్టాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఉభయ సభలు వాయిదా పడిన అనంతరం విజయ్ చౌక్ లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో కలిసి పలువురు ప్రతిపక్ష నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. 'ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) వేయాలి. లేదంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) పర్యవేక్షణలోని కమిటీతో దర్యాప్తు జరిపించండి' అని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కోట్లాది మంది ప్రజల పెట్టుబడులున్నాయని, వారి సొమ్ము ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ముఖ్యమైన సమస్యలను లేవనెత్తినప్పుడు చర్చకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు.

అధికార, ప్రతిపక్షాల భేటీలు

అంతకు ముందు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు అధికార, ప్రతిపక్షాలు భేటీ అయ్యాయి. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో ప్రతిపక్షాలు సమావేశం అయ్యాయి.


న్యూఢిల్లీలోని విజయ్ చౌక్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే, ఇతర ఎంపీలు

పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన వైఖరిపై చర్చించాయి. ఈ సమావేశంలో రాంగోపాల్ యాదవ్ (ఎస్పీ), కనిమొళి (డిఎంకె), ఎలమరం కరీం (సిపిఎం), సుదీప్ బందోపాధ్యాయ, డెరిక్ ఓబ్రెయిన్ (టిఎంసి), వందన చౌహాన్ (ఎన్సిపి), బినయ్ విశ్వం (సిపిఐ), సంజయ్ రౌత్ (శివసేన), కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ (కాంగ్రెస్) తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పార్లమెంట్‌లో ప్రభుత్వం వ్యవహరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రధాని మోడీ కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ వ్యూహంపై చర్చించేందుకు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, అనురాగ్ సింగ్, ఠాకూర్, నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్ జోషి, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ, కిరణ్ రిజిజులతో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశమయ్యారు.

నాగ్‌పూర్‌లో బిజెపికి ఎదురుదెబ్బ

ముంబయి : మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో బిజెపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇక్కడ జరిగిన మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ స్థానం ఎన్నికల్లో బిజెపి అభ్యర్థిపై మహావికాస్ అఘడి (ఎంవిఎ) అభ్యర్థి విజయం సాధించారు. గురువారం వెల్లడైన నాగ్‌పూర్ ఉపాధ్యాయుల స్థానం ఎన్నికల ఫలితాల్లో బిజెపి అభ్యర్థి నాగో గనర్‌పై ఎంవిఎ అభ్యర్థి సుధకర్ ఆద్బలే విజయం సాధించారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న, బిజెపి ప్రముఖ నాయకులు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నీవస్ సొంత పట్టణమైన నాగ్‌పూర్‌లో బిజెపి అభ్యర్థి ఓటమి ఆ పార్టీకి పెద్ద దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు. మహారాష్ట్రలో సోమవారం మొత్తంగా ఐదు లెజిస్లేటివ్ కౌన్సిల్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి.

సింగపూర్‌కు పంజాబ్ ఉపాధ్యాయులు

చండీగఢ్ : వృత్తి శిక్షణలో భాగంగా పంజాబ్‌లో 36 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను ఆ రాష్ట్ర ప్రభుత్వం సింగపూర్ పంపించనుంది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతేడాది అసెంబ్లీ ఎన్నికల ఎన్నికల్లో విద్యారంగాన్ని అభివృద్ధి పరుస్తామని హామీ ఇచ్చాం. ఆ హామీ అమలులో భాగంగానే విద్యా రంగాన్ని సంస్కరించాలనుకున్నాం. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల నుంచి 36 మంది ఉపాధ్యాయుల్ని ఎంపిక చేసి వృతి శిక్షణకు సింగపూర్ పంపించనున్నాం. ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు సింగపూర్‌లో జరిగే ప్రొఫెషనల్ టీచర్స్ ట్రైనింగ్ సెమినార్‌లో ఈ 36 మంది టీచర్స్ పాల్గొంటారు. వారు సింగపూర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత సెమినార్‌కు సంబంధించిన వారి అనుభవాలను తమ సహోద్యోగులు, విద్యార్థులతో పంచుకుంటే ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఈ సెమినార్ అనుభవాలు వారికెంతో ఉపయోగపడతాయి' అని ఆయన అన్నారు. అలాగే విద్యా వ్యవస్థను సంస్కరించడంలో ఈచర్య ఓ మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయత్నాలతో విద్యారంగంలో పంజాబ్ రాష్ట్రమే అగ్రగామిగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



మోడీ విదేశీ పర్యటనలు ఖర్చు ఎంతంటే..?

న్యూఢిల్లీ : నాలుగేళ్ల క్రితం 2019లో రెండోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నరేంద్ర మోడీ 21 సార్లు విదేశీ పర్యటనలు చేశారు. మరి ఈ పర్యటనలకు ప్రభుత్వం చేసిన ఖర్చు అక్షరాలా రూ.22.76కోట్లు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వమే స్వయంగా గురువారం పార్లమెంట్‌కు వెల్లడించింది. 2019 నుంచి ప్రధాని మోడీ విదేశీ పర్యటనల కోసం రూ.22.76కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో ప్రధాని మొత్తం 21 సార్లు విదేశాల్లో పర్యటించగా.. జపాన్‌కు మూడు సార్లు, అమెరికాకు రెండు, యునైటెడ్ అరబ్‌కు రెండు సార్లు వెళ్లారు. అలాగే , 2019 నుంచి రాష్ట్రపతి 8సార్లు విదేశీ పర్యటనలు చేయగా.. అందుకు రూ.6.24కోట్లు ఖర్చయినట్లు కేంద్రమంత్రి మురళీధరన్ వెల్లడించారు. ఇందులో ఏడు పర్యటనలు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేయగా, ప్రస్తుత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్మ ఒకసారి ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లారు. అలాగే, కంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ 2019 నుంచి మొత్తం 86 సార్లు విదేశాల్లో పర్యటించారు. ఇందుకోసం రూ.20.87కోట్లు ఖర్చయినట్లు మురళీధరన్ తెలిపారు.

నేటి నుండి బాల్య వివాహాల కేసులపై చర్యలు

హిమంత బిస్వా

గౌహతి: బాల్య వివాహాల కేసులపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా పట్టు వీడడం లేదు. బాల్య వివాహాలపై ఇప్పటివరకు నమోదైన 4,004 కేసులపై శుక్రవారం నుండి చర్యలు తీసుకుంటామని గురువారం హిమంత బిస్త్వ ప్రకటించారు. బాల్య వివాహాల ప్రమాదాన్ని అంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని' బిస్వా శర్మ గురువారం పేర్కొన్నారు. . ప్రభుత్వం చొరవకు ప్రజలు సహకరించాలని అన్నారు. అత్యధికంగా 370 బాల్య వివాహ కేసులు దుర్భి జిల్లాలో నమోదవగా, హోజాయ్‌లో 255, తమిళ్‌పూర్‌లో 224, కమ్రూప్, కొక్రాజార్‌లో 204 కేసుల చొప్పున నమోదయ్యాయని అన్నారు. గోల్‌పరాలో 157, బొంగైగావ్‌లో 123, దరాంగ్‌లో 125, నాగావ్‌లో 113, మోరిగావ్‌లో 110, దిబ్రూగఢ్‌లో 75, కాచర్‌లో 35, హైలకండిలో ఒక కేసు నమోదైందని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వ యత్నిస్తోందని, బాల్యవివాహాల చట్టం 2006 ప్రకారం కేసులు నమోదవుతాయని అన్నారు.

ఎట్టకేలకు జైలు నుంచి సిద్దిక్ కప్పన్ విడుదల

- 28 నెలల సుదీర్ఘ పోరాటం తర్వాత బెయిల్‌పై విడుదలైన కేరళ జర్నలిస్టు
- ఉపా రాజకీయ సాధనంగా మారిపోయిందని ఆవేదన

లక్నో : 28 నెలల సుదీర్ఘ న్యాయ పోరాటం తరువాత కేరళ జర్నలిస్ట్ సిద్దిక్ కప్పన్ ఎట్టకేలకు ఉత్తరప్రదేశ్‌లోని జైలు నుంచి గురువారం ఉదయం విడుదలయ్యారు. బెయిల్ షరతుల కింద ఒక్కొక్కటీ లక్ష రూపాయిలు విలువైన రెండు పూచీకత్తులను సమర్పించిన తరువాత లక్నో జిల్లా జైలు నుంచి సిద్దికీ కప్పన్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ సందర్భంగా కప్పన్ మాట్లాడుతూ 'న్యాయ ప్రక్రియపై నాకు పూర్తి విశ్వాసం ఉంది. నిజం బయటకు వస్తుంది. నేను నిర్దోషిని. సుమారు 28 నెలల తరువాత జైలు నుంచి విడుదల కావడంపై సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. అలాగే, ఉగ్రవాద కార్యక్రమాల నిరోధక చట్టం (ఉపా) ఒక రాజకీయ సాధనంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఢిల్లీ వెళుతున్నానని, ఆరు వారాల పాటు అక్కడే ఉండాల్సి ఉంటుందని చెప్పారు. రెండేళ్ల జైలు జీవితం చాలా కష్టంగా గడిచిందని చెప్పారు. సిద్దికీ కప్పన్ జైలులో ఉన్న కాలంలో కప్పన్ తల్లి మృతి చెందారు.

2020లో అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన హత్రాస్ అత్యాచర ఘటనపై రిపోర్టింగ్ చేయడానికి వెళుతన్న సమయంలో కప్పన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తరువాత కప్పన్‌పై ఉపా, మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ కింద కేసులు నమోదు చేశారు. పిఎంఎల్ఎ కేసులో గత ఏడాది డిసెంబరు 23న అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్ కప్పన్‌కు బెయిల్ మంజూరు చేసింది. ఈ బెయిల్‌పై లక్నోలోని సెషన్స్ కోర్టు బుధవారం సంతకం చేయడంతో కప్పన్ విడుదల ఖరారయింది. ఉపా కింద నమోదైన కేసులో గత ఏడాది సెప్టెంబరు 9న సుప్రీంకోర్టు సిద్దికీ కప్పన్‌కు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

పరిశ్రమల్లో కార్మికుల మరణ రేటుపై ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆందోళన

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశాలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పరిశ్రమల్లో కార్మికుల మరణాలు, స్థితిగతులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) స్పందించింది. అధిక మరణ రేటుపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై సమగ్ర నివేదికను సమర్పించాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు సంబంధిత అధికారులు, విభాగాలకు నోటీసులు పంపింది. ఆరు వారాల్లోగా స్పందన తెలియజేయాలంటూ ఆదేశించింది. కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఫ్యాక్టరీ అడ్వైస్ సర్వీస్ అండ్ లేబర్ ఇన్‌స్టిట్యూట్స్ (డీజీఎఫ్ఏఎస్ఎల్ఐ) సమాచారం మేరకు పత్రికలో వచ్చిన ఆర్టికల్‌ను ఎన్‌హెచ్‌ఆర్‌సీ సుమోటోగా స్వీకరించింది. ఈ ఆర్టికల్ ప్రకారం 2017 నుంచి 2022 మధ్య దేశంలోని నమోదిత పరిశ్రమల్లో రోజుకు ముగ్గురు చనిపోగా, 11 మంది గాయాలపాలయ్యారు. ఫ్యాక్టరీలతో పాటు ఇతర వ్యాపార సముదాయాల్లో కార్మికుల మానవ హక్కులపై ఈ ఆర్టికల్ తీవ్ర ఆందోళనలను లేవనెత్తుతున్నదని కమిషన్ అభిప్రాయపడింది. ఈ విషయంలో కమిషన్ దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్మిక విభాగాలకు నోటీసులు పంపింది. తమ పరిధిల్లోని ఫ్యాక్టరీలలో కార్మికులు, ఉద్యోగుల యాక్సిడెంట్లు, మరణాలు, గాయాలపాలైనవారికి, మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపు, ఫ్యాక్టరీ చట్టం 1948 కింద ఫ్యాక్టరీ యజమానులపై విచారణ, భద్రతా ఉద్యోగులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆదేశించింది.

కేంద్ర కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ సెక్రెటరీకి కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఈ నోటీసును పంపింది. దేశవ్యాప్తంగా ఫ్యాక్టరీ కార్మికుల విషయంలో మానవ హక్కుల మెరుగుదలకు తీసుకున్న, తీసుకోబోయే చర్యలు, భద్రత, ఆరోగ్య, పని పరిస్థితుల కోడ్ అమలుకు సంబంధించి తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా 2018 నుంచి 2020 మధ్య 3331 మరణాలు నమోదయ్యాయి. ఫ్యాక్టరీ చట్టం 1948 కింద కేవలం 14 మంది శిక్షింపబడటం గమనార్హం.

కొవ్వాడ అణు విద్యుత్‌పై వెస్టింగ్‌హౌస్‌తో చర్చలు

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొవ్వాడలో ఆరు అణు విద్యుత్ కేంద్రాల ఏర్పాటు కోసం వెస్టింగ్‌హౌస్ కంపెనీ (అమెరికా)తో చర్చలు జరుపుతున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. వెస్టింగ్‌హౌస్ కంపెనీతో చర్చలు ముగిసిన అనంతరం అణు విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అయ్యే ఖర్చు, నిర్మాణానికి పట్టే సమయం వంటి వివరాలతో ప్రాజెక్ట్ ప్రతిపాదనలు ఖరారు అవుతాయని మంత్రి వివరించారు. ప్రస్తుతానికి ప్రాజెక్ట్ నిర్మాణానికి ముందు జరిగే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. భూసేకరణ, ప్రాజెక్ట్ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు పొందడం, ప్రాజెక్ట్ స్థలంలో భూమి స్వరూప స్వభావాలపై అధ్యయనం వంటి పనులు జరుగుతున్నాయి. కొవ్వాడ అణు విద్యుత్ ప్రాజెక్ట్ కోసం 2,079 ఎకరాల భూమి అవసరం ఉంది. ఇప్పటికి 2061 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఈ భూమిని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ పేరిట బదలాయించడం కూడా పూర్తయిందని మంత్రి తన జవాబులో పేర్కొన్నారు. నిర్మాణం సమయంలో సుమారు 8 వేల మందికి కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రంలో ఉపాధి లభిస్తుంది. ఈ కేంద్రం నిర్మాణం పూర్తి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన అనంతరం ప్రతి యూనిట్‌లో 2 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్లాంట్‌లలో వచ్చే ఉపాధి అవకాశాలతోపాటు విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభమైన అనంతరం కంట్రాక్టర్లు, వెండర్ల వ్యాపారం వలన జరిగే ఆర్థిక కార్యకలాపాలతో ఇంకా అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి జితేంద్ర సింగ్ వివరించారు.

పోలవరం నిర్వాసితులకు కేంద్రం నేరుగా ఇవ్వడం కుదరదు : కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్

పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లింపుపై కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర షెకావత్ స్పష్టత ఇచ్చారు. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతున్నందున నిర్వాసిత కుటుంబాలకు కేంద్రమే నేరుగా నగదు బదిలీ చేయడం కుదరదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా లేదని తెలిపారు. లోక్‌సభలో వైసిపి ఎంపి వంగా గీత విశ్వనాథ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపి ప్రభుత్వం చేసిన ఖర్చును ఎప్పటికప్పుడు తిరిగి చెల్లిస్తున్నామని షెకావత్ పేర్కొన్నారు. భూసేకరణ కింద 2014 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు రూ. 3,779.05 కోట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిందని, వాటిలో రూ.3,431.59కోట్లు చెల్లించామని తెలిపారు. పరిహారం, పునరావాస ప్యాకేజీ కింద 2014 ఏప్రిల్ నుంచి 2022 డిసెంబర్ వరకు ఏపి ప్రభుత్వం రూ.2,267.29 కోట్ల బిల్లులు సమర్పించగా, ఇప్పటి వరకు రూ.2,110.23కోట్లు తిరిగి చెల్లించామని షెకావత్ పేర్కొన్నారు.

75.3 కిలో మీటర్ల విశాఖ మెట్రోకు ప్రతిపాదనలు అందలేదు

75.3 కిలో మీటర్ల విశాఖ మెట్రోకు ప్రతిపాదనలు అందలేదని కేంద్ర పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి కౌషల్ కిశోరే తెలిపారు. లోక్‌సభ ఎంపి ఎంవివి సత్యనారాయణ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలచే రూపొందిస్తాయి. మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుంది. అయితే, అటువంటి ప్రాజెక్టుల ఆమోదం ప్రతిపాదన సాధ్యత, వనరుల లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సెప్టెంబరులో కొరియన్ ఎక్సిమ్ బ్యాంక్ నుండి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడ్‌లో ఆర్థిక సహాయం కోసం రూ. 8,300 కోట్ల అంచనా వ్యయంతో విశాఖపట్నంలో 42.55 కిలో మీటర్ల పొడవుతో లైట్ మెట్రో రైలు ప్రాజెక్ట్ కోసం ప్రతిపాదనను సమర్పించింది.

ఏపిలో 1,92,290 ఇళ్ళ నిర్మాణం పూర్తి

2022-23లో ఏపిలో 1,92,290 ఇళ్ళ నిర్మాణం పూర్తి అయినట్లు తెలిపింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద 2023 జనవరి 23 వరకు 1,92,290 ఇల్లు పూర్తి అయినట్లు పేర్కొంది. ఇల్లు నిర్మాణానికి రూ.31,622.09 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటి వరకు రూ.17,803.47 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది.

564 మంది విద్యార్థులకు కెవిపివై ఫెలోషిప్‌లు

కిషోరీ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజన (కెవిపివై) పథకం కింద గడచిన 5 ఏళ్ళలో ఆంధ్రప్రదేశ్‌లో 564 మంది విద్యార్థులకు ఫెలోషిప్ అందించినట్లు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. రాజ్యసభలో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా బదులిస్తూ ఈ విషయం తెలిపారు.

విద్యుత్ ఒప్పందాన్ని పునఃపరిశీలించాలి

- అదానీ సంస్థను కోరిన బంగ్లాదేశ్

ఢాకా : అదానీతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని బంగ్లాదేశ్ విద్యుత్ సంస్థ పున:పరిశీలించాలని కోరింది. ఈ మేరకు జార్ఖండ్‌లోని అదానీ పవర్‌ప్లాంట్‌కు బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డ్ (బిపిడిబి) లేఖ రాసింది. అదానీ పవర్ లిమిటెడ్ నుండి విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై 2017లో బంగ్లాదేశ్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు కోసం కొనుగోలు చేయాల్సిన బొగ్గు ధరను అదానీ పవర్‌ప్లాంట్ అధికంగా డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. జార్ఖండ్‌లోని 1600 మెగావాట్ల ప్లాంట్‌కు ఇంధనంగా వినియోగించే బొగ్గును దిగుమతి చేసేందుకు ఎల్‌సిలను ప్రారంభించడానికి సంబంధించి వచ్చిన అభ్యర్థనల మేరకు తాము అదానీ సంస్థకు లేఖ రాశామని బిపిడిబికి చెందిన ఓ అధికారి తెలిపారు. ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్ బంగ్లాదేశ్‌కు ఎగుమతి అవుతుందని, దీంతో బొగ్గు రవాణా సహా కొనుగోలుకయ్యే ఖర్చులన్నీ బంగ్లాదేశ్ భరించాల్సి వుంది. ఈ బొగ్గు ధరను విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో చేర్చాల్సి వుంది. స్థానిక మీడియా ప్రకారం.. బొగ్గు దిగుమతికి సంబంధించి ఎల్‌సిలను ప్రారంభించే ముందు భారత అధికారులకు అదానీ పవర్ డిమాండ్ నోట్‌ను సమర్పించాల్సివుంది. దీంతో డిమాండ్ నోట్‌ను ఇవ్వాల్సిందిగా బిపిడిబిని కోరినట్లు తెలిపింది. అయితే డిమాండ్ నోట్ బొగ్గు ధరను మెట్రిక్ టన్ను 400 డాలర్లుగా పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రస్తుత పరిస్థితులను అనుసరించి ఇది చాలా ఎక్కువని బంగ్లాదేశ్ అధికారులు వాదిస్తున్నారు. ఇతర ప్లాంట్‌లకు మెట్రిక్ టన్ను బొగ్గుకు 250 డాలర్లు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందంలో తగ్గింపు నిబంధన లేకపోవడంతోనే ఈ అధిక ధర చెలించాల్సి వస్తుందని పేర్కొంది. ఇది టారిఫ్ పెంపుకు దారితీస్తుందని.. దీంతో వినియోగదారులపై అధిక భారం పడుతుందని అన్నారు. ఒకవేళ బొగ్గు ధరను మార్చకపోతే... అదానీ సంస్థ నుండి విద్యుత్ కొనుగోలు నిలిపివేయాల్సి వుంటుందని అధికారులు స్పష్టం చేశారు.

ఫెలోషిప్‌ను పెంచండి

- పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు
- బెంగళూరులోని ఐఐఏ పీహెచ్‌డీ విద్యార్థుల నిరసన



బెంగళూరు : కర్నాటకలోని కేంద్ర విద్యా సంస్థ అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐఐఏ) పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు మెరుపు నిరసన ప్రదర్శనలకు దిగారు. తమ ఫెలోషిప్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణంతో పెరుగుతున్న ఖర్చుల కారణంగానే తాము ఈ డిమాండ్‌ను చేస్తున్నట్టు చెప్పారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంలో డిమాండ్ల సాధనకు విద్యార్థులు నిరసనకు దిగారు. తమకు వచ్చే స్టైఫండ్‌లో రూ. 5 వేలు హాస్టల్ వసతికే కట్ అవుతున్నాయనీ, దీంతో తమ చేతుల్లో మిగిలే కొద్ది పాటి మొత్తంతా నెలంతా గడవటం కష్టంగా మారిందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మరికొందరు విద్యార్థులైతే పేద, మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారు ఉన్నారు. వీరిలో చాలా మంది తమకు వచ్చే స్టైఫండ్‌లో కొంత భాగాన్ని తమ వద్ద ఖర్చులకు ఉంచుకొని మిగతా మొత్తాన్ని వారి తల్లిదండ్రులకు ఇళ్లు గడవటానికి పంపుతున్నారు. ఎన్నో ఆశలతో.. ఉన్న లక్ష్యాలను అధిరోహించాలన్న లక్ష్యంతో తాము ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో చేరామనీ, ఫెలోషిప్‌ల సాయంతోనే తాము ముందుకెళ్లగలమని పరిశోధక విద్యార్థులు తెలిపారు. "మాది బీహార్. మాది వ్యవసాయ కుటుంబం. అయితే, వ్యవసాయంతో మాకు పూట గడవటమే కష్టంగా మారింది. సాగు నుంచి వచ్చే మొత్తం.. తర్వాత పంటకు తిరిగి పెట్టుబడి పెడతారు. అంతగా లాభం లేదు. అయితే, ఈ సారి వరదల కారణంగా పంట నష్టం ఏర్పడింది. దీంతో వారు (కుటుంబీకులు) నా స్టైఫండ్‌పై ఆధారపడ్డారు. నేను వారికి ప్రతి నెలా రూ. 20 వేలు పంపుతాను. నేను నా ఖర్చుల కోసం నా దగ్గర రూ. 5 వేలు ఉంచుకుంటాను. ఇంత మొత్తంతో ఖరీదైన నగరంలో మనుగడ సాగించటం కష్టం" అని రెండో సంవత్సరం చదువుతున్న పీహెచ్‌డీ స్కాలర్ సుశాంత్ కుమార్ (25) ఆందోళన వ్యక్తం చేశారు. ఫెలోషిప్ మొత్తాన్ని పెంచితే, ఇది అందరు పరిశోధక విద్యార్థులు, వారి కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుందని నాలుగో సంవత్సరం చదువుతున్న పీహెచ్‌డీ విద్యార్థి శుభం ఘతుల్ తెలిపారు. కేంద్రం బడ్జెట్ నేపథ్యంలో స్కాలర్‌షిప్‌లకు సంబంధించి దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో నిరసనలు వెల్లువెత్తుతున్న విషయం విదితమే.

18 కొలీజియం సిఫార్సులను వెనక్కి

- పెండింగ్‌లో 64
- రాజ్యసభలో కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు కొలీజియం చేసిన 18 సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. గురువారం రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, ఆప్ ఎంపి రాఘవ్ చద్దా అడిగిన రెండు ప్రశ్నలకు కేంద్ర లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. న్యాయమూర్తి పదవికి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన 18 సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించిందని, ఆ ఫైళ్లను కొలీజియంకు తిరిగి ఇచ్చిందని తెలిపారు. ఇంకా, కొలీజియం చేసిన 64 సిఫార్సులు ప్రభుత్వం ముందు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

హైకోర్టులో 333 న్యాయమూర్తి పోస్టులు ఖాళీ

వివిధ హైకోర్టుల్లో 1,108 మంది న్యాయమూర్తులు ఉండగా, ప్రస్తుతం 775 మంది న్యాయమూర్తులు ఉండగా, 334 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. ఈ ఖాళీలకు సంబంధించి హైకోర్టు కొలీజియాలు సిఫార్సు చేసిన 142 ప్రతిపాదనలు ప్రాసెసింగ్‌లో వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. 2019 నుంచి జనవరి 2023 వరకు సుప్రీంకోర్టుకు 22 మంది న్యాయమూర్తులు, వివిధ హైకోర్టులకు 446 మంది న్యాయమూర్తులు నియమితులయ్యారని తెలిపారు. సుప్రీం కోర్టులో ప్రస్తుతం 7 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 5, తెలంగాణ హైకోర్టులో 10 న్యాయమూర్తి పోస్టులు ఖాళీగా ఉన్నాయని టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

వివిధ శాఖల్లో 9,79,327 పోస్టులు ఖాళీలు

కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌ల్లో 9,79,327 పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2021 మార్చి 1 నాటికి 78 మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్‌ల్లో 9,79,327 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అందులో అత్యధికంగా రైల్వే శాఖలో 2,93,943, డిఫెన్స్ లో 2,64,706, హోం శాఖలో 1,43,536, పోస్టల్లో 90,050, రెవెన్యూలో 80,243, ఆడిట్, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో 25,934 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

12 పెట్రోలియం పిఎస్ యుల్లో 5,460 ఖాళీలు

దేశంలో 12 పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్ యు)ల్లో 5,460 ఖాళీలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలీ తెలిపారు. వైసిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2023 జనవరి నాటికి దేశంలో 12 పెట్రోలియం మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ (పిఎస్ యు)ల్లో 5,460 ఖాళీలు ఉన్నాయని అన్నారు. అందులో ఎగ్జిక్యూటివ్ 3,533 పోస్టులు కాగా, నాన్ ఎగ్జిక్యూటివ్ 1,927 పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు.

రాష్ట్రాల, కేంద్ర పాలిత కాలుష్యం నియంత్రణ బోర్డుల్లో 5,873 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మొత్తం 11,956 పోస్టులకు గాను, 5,873 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది.



మీకోసం

వేపుడు కూరలు చేసేటప్పుడు నూనెలో చిటికెడు ఉప్పు వేస్తే నూనె ఎక్కువగా పీల్చదు.

జీవన సౌరభం

అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక

నౌకా నిర్మాత ఆర్దశీర్ కుర్సట్జీ



19వ శతాబ్దపు భారతదేశంలో జీవించిన ఓ గొప్ప మెరైన్ ఇంజినీరు ఆర్దశీర్ కుర్సట్జీ (1808–1877). ప్రపంచంలో అన్ని దేశాల్లో బ్రిటిష్ వారు తమ ఆధిపత్యాన్ని చూపిస్తున్న రోజులు. సాంకేతిక నైపుణ్యంతో ఆవిరి యంత్రంతో నడిచే ఓడలు నడిచేవి. ఇండియాలో తమ కార్యాలయాల్లో పని చెయ్యడానికి భారతీయులకి శిక్షణ నిచ్చారు. అలా ఎంతో మంది భారతీయులతో పాటు తానూ సాంకేతిక విద్యలో శిక్షణ పొందారు ఆర్దశీర్ కుర్సట్జీ.

బ్రిటిష్ వారు బొంబాయిలో రేవు నిర్మించాలనుకున్నారు. అప్పుడు నౌకా నిర్మాణంలో ఓక్ కలప వాడేవారు. కాని బ్రిటిష్ నౌకాదళ విస్తరణ వల్ల అన్ని ఓడలని నిర్మించడానికి ఓక్ చెట్లు సరిపోలేదు. దాంతో స్థానికంగా దొరికే మలబార్ టేకు కలపని వాడడం మొదలెట్టారు. ఈ కొత్త నౌకా నిర్మాణ పద్ధతితో కుర్సట్జీ కుటుంబ సభ్యులూ ఎంతో కృషి చేశారు.

కుర్సట్జీ ఆవిరి యంత్రాల నిర్మాణంలోనూ పనిచేశారు. చిన్న వయసులోనే 1–హెచ్.పి. యంత్రం నిర్మించి తన సత్తా నిరూపించుకున్నాడు. ఇండియాలో నిర్మించబడ్డ మొట్టమొదటి ఆవిరి యంత్రంగా గొప్పగా చెప్పుకున్నారు. దాంతో ఓ నీటి పంపు తయారుచేసి ప్రదర్శించాడు. గ్యాస్‌తో విద్యుత్ దీపాలు ఎలా అమర్చాలో చేసి చూపించాడు. నౌకలలో వాడే అధునాతన ఆవిరి యంత్రాల గురించి ఇంకా లోతుగా తెలుసుకోడానికి ఓ ఏడాది పాటు ఇంగ్లండ్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఆయన పనితీరుకు మెచ్చి రాయల్ సొసైటీలో సభ్యత్వం ఇచ్చారు. ఈ కొత్త ఉద్యోగంలో ఎంతో మంది బ్రిటిష్ వారు కూడా కుర్సట్జీ కింద పనిచెయ్యాల్సి వచ్చింది.

1851లో కుర్సట్జీ తన పూర్వీకుల గౌరవార్థం 'లోజీ ఫామిలీ' అనే పేరుతో ఓ స్టీమరును విడుదల చేశాడు. ఆ స్టీమరులో వాడిన విడిభాగాలన్నీ తన సొంత ఫౌండ్రీలో ఉత్పత్తి చేసినవి. బొంబాయిలో మొట్టమొదటిసారిగా కుట్టుమెషిను, ఫోటోగ్రఫీ, ఎలక్ట్రో ప్లేటింగ్ వంటి సాంకేతిక నైపుణ్యాల ప్రవేశానికి కూడా ఇతడే కారణం. 1861లో ఇండస్ ఫ్లోటిలా కంపెనీలో సూపర్ ఇంటెండింగ్ ఇంజినీరుగా పదవీ స్వీకారం చేశాడు. తర్వాత ఇంగ్లండ్‌కి వెళ్లి రిచ్మండ్ అనే ఊళ్లో స్థిరపడ్డాడు. 16 నవంబర్ 1877లో అక్కడే కన్నుమూశాడు.



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ





- ఎం. మరియం ఖాతున్,
5 వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి,
చిత్తూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మానవత్వ పరిమళం.. ఆ మాతృ హృదయం...

తమ ఇంట్లో పనిచేసే చక్కీ చనిపోయిందన్న వార్త తెలియగానే సుబేదా తన ఒడిలో ఉన్న పిల్లాడిని అత్తగారికి అప్పగించి హడావిడిగా వెళ్లింది. అక్కడి నుంచి తిరిగొస్తూ తనతో ముగ్గురు పిల్లలను వెంట తీసుకొచ్చింది. వాళ్లు చక్కీ పిల్లలు. ఏడాది వయసున్న శ్రీధరన్, అతని అక్కలు రమణి, లీల ఆమె వెంట ఆ ఇంట్లోకి ప్రవేశించారు. ఆ రోజు నుంచి ఆ తల్లి తన బిడ్డలతో పాటుగానే వారినీ పెంచింది. విద్యాబుద్ధులు నేర్పించింది. ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి అత్తవారింటికి పంపింది. ఇందులో చెప్పకోవడానికి ఏముంది? తల్లి చనిపోయిన పిల్లలను ఎవరైనా ఆదరిస్తారు.. అనుకోవచ్చు. కాని ఇక్కడ ఆ తల్లి ముస్లిం.. పిల్లలు హిందూ.. రెండు మతాలకు చెందిన పిల్లలు ఒకే ఇంట్లో అన్నదమ్ముళ్లుగా.. అక్కచెల్లెళ్లుగా కలసిమెలసి పెరిగారు. ఆ అమ్మ గురించి చెప్పకోవడం ఇప్పుడు చాలా అవసరం.

'ఈ రోజు మా ఉమ్మా చనిపోయింది. ఈ వార్త నన్ను ఎంతో బాధించింది. ఒమన్‌లో ఉంటున్న నేను ఈ సమయంలో ఆమెను చూడలేకపోతున్నాను' అంటూ శ్రీధరన్ తన ఫేస్‌బుక్ ఐడిలో ఉమ్మా ఫొటో జోడిస్తూ ఓ పోస్టు పెట్టారు. (మలయాళంలో తల్లిని ఉమ్మా అని సంబోధిస్తారు) సాధారణంగా ఇటువంటి పోస్టులకు వెంటనే స్పందించేవారు చాలామందే ఉంటారు. విచారం వ్యక్తం చేస్తూ తమ సంతాపాలు తెలియజేస్తుంటారు. కాని శ్రీధరన్ పోస్టుకు అనుకోనివిధంగా స్పందనలు వచ్చాయి. 'నీది ఫేక్ అకౌంటా? నీ పేరు హిందువుగా ఉంటే మీ తల్లి అంటూ ఓ ముస్లిం మహిళ ఫొటో పెట్టేవేంటి?' అంటూ అతనిపై దాడి చేసినట్లుగా సందేశాలు వచ్చాయి. అసలే తల్లి పోయిన దు:ఖంలో ఉన్న శ్రీధరన్ ఆ సందేశాలను చూసి తట్టుకోలేకపోయాడు. వెంటనే ఆ అమ్మ గురించి ఫేస్‌బుక్ స్నేహితులకు చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

ఈ కథ అప్పుడు మొదలైంది..

'నా పేరు శ్రీధర్.. మేము కేరళ నిలంబూర్ కలికావు గ్రామంలో ఉండేవాళ్లం. నాకు ఏడాది వయసున్నప్పుడు మా అమ్మ చనిపోయింది. ఆమె సుబేదా ఇంట్లో పనిచేసేది. అమ్మ చనిపోయిన రోజు మా ఇంటికి సుబేదా, ఆమె భర్త అజీజ్ హాజీ


సుబేదా

చూడడానికి వచ్చారు. వాళ్లకి అప్పటికే ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయినా తల్లి చనిపోయిన మేము దిక్కులేని వాళ్లమవుతామని వారిద్దరూ మమ్మల్ని తమతో వాళ్లింటికి తీసుకెళ్లారు. మేము ఎప్పుడూ ఆ ఇంట్లో పరాయివారిగా లేము. నా కంటే చిన్నవాడైన జాఫర్‌తో పాటే అమ్మ నాకు కూడా పాలు ఇచ్చేదని మా అక్కలు చెప్పేవారు' అంటూ శ్రీధరన్ గొప్ప ప్రేమ, మానవత్వం కలబోసిన ఉమ్మా గురించి ఈ ప్రపంచానికి తెలియజేశాడు.

'మా అమ్మ చనిపోయేనాటికి నాన్న ఉన్నాడు. కాని ఉమ్మా మమ్మల్ని తనతో ఎందుకు తీసుకెళ్లింది? అని మీకు అనుమానం రావచ్చు. అంతంతమాత్రం సంపాదన ఉన్న మా నాన్న మమ్మల్ని సరిగ్గా పెంచుతాడన్న నమ్మకం లేదు. అనాథలుగా మిగిలిపోతామేమోనన్న భయంతో, మా అమ్మ మీద ఉన్న అభిమానంతో మమ్మల్ని తమ వెంట తీసుకెళ్లారు' అంటూ శ్రీధరన్ చేసిన పోస్టుకు చాలామంది స్పందించారు. గొప్ప తల్లి అంటూ సుబేదాను కొనియాడారు. ఈ సానుకూల స్పందనను చూసిన ఆ ఆరుగురు అక్కాచెల్లెళ్లు.. అన్నాదమ్ములు చాలా ఆశ్చర్యపోయారు.


శ్రీధరన్, అజీజ్ హాజీ

'మేమంతా ఒకే ఇంట్లో పెరిగాం. మేమెప్పుడూ రెండు కుటుంబాలు, రెండు మతాలకు చెందిన వారమని భావించలేదు. ఉమ్మా మొట్టమొదటిసారి రమణి, లీల, శ్రీధరన్‌ను ఇంటికి తీసుకొచ్చినప్పుడు మా ఇంట్లో ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. అప్పా కూడా ఉమ్మాను గౌరవించారు' అంటూ ఆనాటి సంఘటనను గుర్తుచేసుకున్నాడు సుబేదా పెద్ద కొడుకు షన్వాస్.

సామరస్యం .. ఆమె అభిమతం

'ఒకసారి నేను ఉమ్మా దగ్గరకు వెళ్లి మమ్మల్ని మీ ఇస్లాం మతంలోకి ఎందుకు మార్చలేదు' అని ప్రశ్నించాను. అప్పుడు ఉమ్మా చాలా భయపడింది. ఎవరో నన్ను ప్రలోభ పెడుతున్నారని కలవరపడింది. 'మతం ఎవ్వరినీ విడదీయమని చెప్పదు. ఏ మతమైనా ప్రేమను పంచమని, సహాయం చేయమనే చెబుతుంది. కొందరు


చిత్రంలోని ఓ దృశ్యం

మనుషులు తప్పుడు భావాలను ప్రచారం చేస్తారు.' అంటూ ఆ రోజు ఉమ్మా నాకు చెప్పింది' అంటూ మతసామరస్యం గురించి ఆ తల్లి చెప్పిన విషయాన్ని కూడా పోస్టు చేశాడు శ్రీధరన్.

'మేం ముగ్గురం దేవాలయాలకు వెళ్లేవాళ్లం. గంధాలు, కుంకాలు పెట్టుకుని తిరిగేవాళ్లం. సుబేదా ఉమ్మా ఇంట్లో ఏ రోజూ.. ఎవరూ మాకు అభ్యంతరం చెప్పలేదు. దొంగతనం చేయొద్దని, అబద్ధం చెప్పొద్దని, ఇతరులను హింసించవద్దని మాత్రం ఉమ్మా చెప్పేది. అదే మేం ఆచరించేవాళ్లం. మమ్మల్ని సుబేదా అమ్మ చేరదీసి ఉండకపోతే.. మేం అనాథలుగానే కాదు, తక్కువ కులం వారిగా పరిగణించబడేవాళ్లం. మాలాంటి వాళ్లు మౌనంగా.. అందరికీ లోబడి బతకాల్సిన స్థితి అప్పటి సమాజంలో ఉంది. మేము ఆ దీనస్థితి నుండి బయటపడ్డాం. మాకు నచ్చిన పనులు చేశాం. సమాజంలో గౌరవంగా జీవిస్తున్నాం. సుబేదా అమ్మ మమ్మల్ని అలా పెంచింది. మా ఆరుగురినీ ఒకే గొడుగు కింద పెంచింది. మా అమ్మ చనిపోయాక మా నాన్న రెండో పెళ్లి చేసుకున్నాడు. నాన్న చనిపోయాక ఆమెకు పుట్టిన ఆడపిల్లను కూడా సుబేదా అమ్మ చేరదీసింది. ఈ సంగతి ఎవరికీ తెలియదు' అంటూ ఆనాటి సంఘటనను గుర్తుచేసుకున్నప్పుడు శ్రీధరన్ కళ్లు చెమర్చాయి.

ఎన్నో సేవలు ...

సుబేదా గురించి శ్రీధరన్ పోస్టు చేసిన వివరాలు స్వల్పకాలంలో బాగా వైరల్ అయ్యాయి. ప్రముఖ మలయాళ దర్శకులు సిద్ధిక్ వరకు ఆ సంగతులు వెళ్లాయి. ఈ మానవతా మూర్తి గురించి తెరపై చూపించాలని సుబేదా కుటుంబ సభ్యులను అతను కలిశాడు. అయితే ఆ ఊరు వెళ్లిన సిద్ధిక్‌కు శ్రీధరన్ చెప్పిన సుబేదా అమ్మలో మానవత్వమే కాదు గొప్ప సేవామూర్తి కూడా ఉన్నారని తెలిసింది. ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కూడా సుబేదా గురించి తెలియని వారు లేరు. పుట్టింటి వారసత్వంగా వచ్చిన ఆస్తిని తన సొంతానికి వాడుకోకుండా పేదవారికి సాయం చేసేది. ప్రతి ఏడాది వారికి బట్టలు, నగలు పంచిపెట్టేది. 12 ఎకరాల భూమిని అమ్మి మరీ సాయం చేసింది. తన దగ్గర లేకపోతే రుణం తీసుకుని మరీ ఇచ్చేది. ఆమె చనిపోయేనాటికి రూ.28 లక్షల అప్పు మిగిలివుంది. షన్వాస్ ఆ రుణం తీర్చేశాడు. ఇంకో విశేషమేమంటే సుబేదా అమ్మ చనిపోయినప్పుడు స్థానిక చర్చిలో గంటలు మోగించారు. ప్రార్థనలు చేశారు. సాధారణంగా క్రిష్టియన్ ఎవరైనా చనిపోతే అలా చేస్తారు. కాని ఓ ముస్లిం మహిళకు ఆ గౌరవం ఇచ్చారు. ఇంతటి ప్రేమ, దయ, కరుణ గల అమ్మ గురించి ప్రపంచానికి తనదైన శైలిలో చూపించాలనుకున్న సిద్ధిక్ ఆ ప్రయత్నంలో సఫలమయ్యారు.'ఎన్ను స్వంతం శ్రీధరన్' (ప్రేమతో, శ్రీధరన్) పేరుతో ఆయన తెరకెక్కించిన చిత్రం జనవరి 9న ప్రీమియర్‌గా ప్రదర్శించబడింది.

'ఇప్పుడు సుబేదా అమ్మ లేదు. హాజీ లేరు. వారు పంచిన ప్రేమ మాత్రం అలాగే ఉంది. మేం ఆరుగురం ఇప్పటికీ అదే ప్రేమాభిమానాలతో కలసిమెలసి ఉంటున్నాం' అంటున్నాడు శ్రీధరన్.

'ప్రజలంతా చాలా మంచివారు. కొన్ని సార్లు వాళ్ల మంచితనాన్ని గుర్తుచేయడానికి ఇటువంటి వారి కథలు అవసరం. సుబేదా అలా జ్ఞాపకం చేసుకోవడానికి అర్హురాలైన మహిళ.. ఆమె కథ పదే పదే మనం చెప్పకోవాలి' అంటారు సిద్ధిక్.

బిజెపికి ప్రజలే బుద్ధి చెబుతారు

- విభజన హామీల అమలులో కేంద్రం తాత్సారం
- విద్యార్థి, యువజన సంఘాల సమరయాత్రలో వక్తలు


విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి – అనకాపల్లి, ఉక్కు నగరం, విశాఖ కలెక్టరేట్

ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర ప్రజలను మోసగించిన బిజెపి పాలకులకు రానున్న కాలంలో బుద్ధి చెబుతారని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. హోదాపైనే యువత భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకూ చేపట్టిన సమరయాత్ర గురువారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించింది. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొన్నారు. ఆయా సభల్లో ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా విభజన హామీలను కూడా నెరవేర్చకుండా చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఎందుకు మౌనం దాల్చుతున్నారని ప్రశ్నించారు. 'ప్రత్యేక హోదా ఎందుకు తేలేదు మావయ్యా' అని విద్యార్థులు, యువత కలిసి సిఎం జగన్‌ను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. విశాఖ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం అమ్మేయాలని చూస్తోందన్నారు. రెండేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలితంగా ఉక్కు ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. విద్యార్థులు, యువకులు పోరాడితే ప్రత్యేక హోదా వస్తుందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ.. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలని, సెంట్రల్ యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి కొరవడిందన్నారు. వారికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ యాత్రలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, అల్లూరి సీతారామరాజు వారసులు సత్యనారాయణరాజు మాట్లాడారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు. యాత్ర ఎయులోకి ప్రవేశించినప్పుడు అక్కడి వర్సిటీ సిబ్బంది అడ్డుకున్నారు. నాయకులు, సిబ్బందికి మధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం యాత్ర విజయనగరం వైపుకు సాగింది.

'ఉక్కు' పోరాటానికి మద్దతు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్షలకు విద్యార్థి, యువజన సంఘాల సమరయాత్ర బృందం మద్దతు తెలిపింది. ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని నాయకులు తెలిపారు.

కొనసాగుతున్న అదానీ షేర్ల పతనం

రూ.8.65 లక్షల కోట్లు ఫట్



న్యూఢిల్లీ : అదానీ గ్రూపు పన్ను ఎగవేతలు, అక్రమాలు, మోసాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్ స్టాక్ మార్కెట్లలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. అదానీ గ్రూపు కంపెనీలతో పాటు ఆయా సంస్థలకు రుణాలిచ్చిన బ్యాంకులు, ఆర్థిక సంస్థల షేర్లు కూడా నేలచూపులు చూస్తున్నాయి. అదానీ గ్రూపులపై వస్తున్న ఆరోపణలకు తోడు గ్లోబల్ విత్త కంపెనీల ఆంక్షలతో అదానీ కంపెనీల షేర్లు కుప్పకూలుతున్నాయి. ఈ దెబ్బకు వారం రోజుల్లో అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.8.65 లక్షల కోట్లు లేదా 45 శాతం పైగా పతనమయ్యింది. గురువారం సెషన్‌లో అదానీ కంపెనీల షేర్లన్నీ లోహర్ సర్క్యూట్‌ను తాకాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్ విలువ 26.7 శాతం పతనమయి రూ.1,565కు క్షీణించింది. ఓ దశలో 35 శాతం క్షీణించి రూ.1,494 కనిష్ట స్థాయికి దిగజారింది. ఉదయం ఓ దశలో అమ్మేవారే కానీ.. కొనేవారు లేని దుస్థితి నెలకొంది. అదానీ ట్రాన్స్‌మీషన్ షేర్ 10 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ సూచీ 10 శాతం చొప్పున క్షీణించాయి. అదానీ పోర్ట్స్ 6.6 శాతం, అదానీ పవర్ 4.98 శాతం, అదానీ విల్మర్ 5 శాతం చొప్పున నేల చూపులు చూశాయి. ఈ వారం రోజుల్లోనే అనేక సూచీలు ఆల్‌టైం గరిష్ట స్థాయి నుంచి దాదాపు 60 శాతం మేర క్షీణించాయి. ఇన్వెస్టర్లలో విశ్వాసం కల్పించేందుకు గౌతం అదానీ స్వయంగా ప్రకటన జారీ చేసినప్పటికీ షేర్ల పతనం ఆగలేదు. మరో వైపు బిఎస్ఇ సెన్సెక్స్ 224 పాయింట్లు రాణించి.. 59,932కు చేరగా.. ఎన్ఎస్ఇ నిఫ్టీ స్వల్పంగా 6 పాయింట్లు తగ్గి 17,610 వద్ద ముగిసింది.

అదానీ బాండ్లను తనఖా పెట్టుకోం సిటీ గ్రూప్ బ్యాంక్

అదానీ కంపెనీల బాండ్లు హామీలకు పనికిరావని ఇప్పటికే స్విస్‌కు చెందిన క్రెడిట్ సూస్సె ప్రకటించగా.. తాజాగా అమెరికాకు చెందిన సిటీ గ్రూపు బ్యాంక్ అదే తరహా షాక్ ఇచ్చింది. అదానీ కంపెనీలు జారీ చేసిన బాండ్లను తనఖాగా పెట్టుకుని బ్రోకర్లకు అప్పులివ్వలేమని స్పష్టం చేశాయి. "అదానీ కంపెనీలు జారీ చేసిన సెక్యూరిటీల ధరల్లో ఇటీవల భారీ తగ్గుదల ను చూశాము. ఆ గ్రూప్ ఆర్థిక పటిష్టంపై ప్రతికూల వార్తలను చూస్తున్నాము. అదానీ జారీచేసిన అన్ని సెక్యూరిటీలకు తక్షణం అమలులోకి వచ్చేలా రుణ విలువను తొలగించాలని నిర్ణయించాము." అని సిటీ గ్రూపు బ్లూమ్‌బర్గ్ న్యూస్‌కు తెలిపింది.

ఎఫ్‌పిఒ నిధులను తిరిగిస్తాం : అదానీ

అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎఫ్‌పిఒ ద్వారా సమీకరించిన రూ.20,000 కోట్ల నిధులను తిరిగి ఇన్వెస్టర్లకు చెల్లిస్తామని గౌతమ్ అదానీ గురువారం స్పష్టం చేశారు. ఈ ఎఫ్‌పిఒను నిలిపివేయాలని తమ కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారన్నారు. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

రూ.5కోట్ల నజరానా

అండర్–19 ప్రపంచకప్ విజేతలకు ఘన స్వాగతం





న్యూఢిల్లీ: ఐసిసి అండర్–19 మహిళల ప్రపంచకప్ టైటిల్‌ను గెలిచిన టీమిండియా జట్టుకు బిసిసిఐ రూ.5కోట్ల చెక్కును అందజేసింది. ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు బుధవారం చేరుకున్న యువజట్టుకు కుటుంబ సభ్యులు, అధికారులు, అభిమానులు పూలదండలు, పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. అనంతరం కారులో కొంత దూరం పయనించి అనంతరం అహ్మదాబాద్‌కు ఆటగాళ్లంతా చేరకున్నారు. భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య మూడో టి20 ముగిసిన అనంతరం బిసిసిఐ అధికారులు చెక్కును అందజేశారు.

టి20 ప్రపంచకప్‌లో ఆడిన తెలగమ్మాయిలు జి. త్రిషా, యషశ్రీలకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఇతర అధికారులు, కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రీడాకారులు టి20 ప్రపంచకప్‌లో తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ఐసిసి తొలిసారి నిర్వహించిన ప్రపంచకప్‌ను గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. క్రికెట్‌లో మాత్రమే కాకుండా ప్రతి క్రీడలోనూ మహిళలు రాణించాలన్నారు.

ఊరిస్తున్న విజయం

ఆంధ్ర–మధ్యప్రదేశ్ రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్స్

ఇండోర్: ఆంధ్ర–మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ రసకందాయంలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 151పరుగుల ఆధిక్యత లభించిన ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ బౌలర్ల ధాటికి 93పరుగులకే కుప్పకూలింది. గాయపడ్డ ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి చివరి వికెట్‌గా బరిలోకి దిగి ఒంటిచేత్తో బ్యాటింగ్ చేస్తూ.. 15పరుగులతో రాణించాడు. ఆవేశ్ ఖాన్‌కు నాలుగు, కార్తికేయ, గౌరవ్ యాదవ్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. దీంతో 245పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఆంధ్రజట్టు మధ్యప్రదేశ్ ముందుంజగలిగింది. అనంతరం మధ్యప్రదేశ్ జట్టు రెండోఇన్నింగ్స్ ఆరంభించి మూడోరోజు ఆట ముగిసే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 58పరుగులు చేసింది. యశ్ దూబే(24), హిమాన్షు(31) క్రీజ్‌లో ఉన్నారు. అంతకుముందు మధ్యప్రదేశ్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 228పరుగులకు ఆలౌటైంది. ఆవేశ్ ఖాన్(15), కార్తికేయ(24) బ్యాటింగ్‌లో రాణించారు.

ముక్కోణపు సిరీస్ విజేత దక్షిణాఫ్రికా

ఫైనల్లో టీమిండియా మహిళలు పరాజయం

ఈస్ట్ లండన్(దక్షిణాఫ్రికా): ఓటమి ఎరుగని టీమిండియా మహిళల జట్టుకు ఫైనల్లో నిరాశ తప్పలేదు. గురువారం జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు 5వికెట్ల తేడాతో భారతజట్టును ఓడించి టైటిల్‌ను ఎగరేసుకుపోయింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 109పరుగులే చేయగల్గింది. ఓపెనర్లు మంధాన(0), రోడ్రిగ్స్(11) స్వల్పస్కోర్‌కే పెవీలియన్‌కు చేరగా.. హర్లీన్ డియోల్(46నాటౌట్), కౌర్(21) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో టీమిండియా జట్టు పరుగులు రాబట్టేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 47పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డా.. ట్రయాన్(57నాటౌట్; 32బంతుల్లో 6ఫోర్లు, 2సిక్సర్లు), క్లార్క్(17నాటౌట్; 17బంతుల్లో ఫోర్) కలిసి 6వ వికెట్‌కు 47పరుగులు జతచేసి దక్షిణాఫ్రికాను గెలిపించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ట్రయాన్‌కు, సిరీస్ దీప్తి శర్మకు లభించాయి. ఈ టోర్నీలో టీమిండియా జట్టు వరుసగా విజయాలతో ఫైనల్లోకి దూసుకొచ్చిన సంగతి తెలిసిందే.



విజయవాడ ప్రభుత్వ పాలిటిక్నిక్ కళాశాలలో జరుగుతున్న 25వ ఇంటర్ రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 13 జిల్లాల పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 1600మంది క్రీడాకారులు విచ్చేశారు. మూడురోజుల పాటు సాగే ఈ క్రీడలు శుక్రవారంతో ముగియనున్నాయి.



మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు 2–1తో చేజిక్కించుకుంది. బుధవారం రాత్రి జరిగిన మూడో, చివరి వన్డేలో ఇంగ్లండ్ జట్టు 59పరుగుల తేడాతో గెలిచినా ప్రయోజనం లేకపోయింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి ఇంగ్లండ్ జట్టు 50 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 346పరుగులు చేయగా.. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 287పరుగులకే ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ బట్లర్‌కు లభించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68